


యండమూరి వీరేంద్రనాథ్

రచనల్లోంచి ఏరికూర్చిన
సుభాషితాల సంపుటం

మంచుపూల వర్షం

మంచుపూల వర్షం

యండమూరి వీరేంద్రనాథ్

రచనల్లోంచి ఏరికూర్చిన

సుభాషితాల సంపుటం

Kinige

MANCHPULA VARSHAM

By :

YANDAMOORI VEERENDRANATH
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
HYDERABAD – 500 034
Ph. 924 650 2662
yandamoori@hotmail.com
yandamoori.com

SARASWATHI VIDYA PEETAM,
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G.Dist. (A.P.)

Publishers :
NAVASAHITHI BOOK HOUSE
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
E-mail : navasahithiravi@gmail.com

Excellent : ★★★★★

Verry Good : ★★★★

Good : ★★★

Above : ★★

Average : ★

(పాఠకుల అభిప్రాయం ప్రకారం ఏర్పడిన రాంకింగ్స్)

మంచుపూల వర్షం

మైండ్ పవర్ : నెంబర్ వన్ అవడం ఎలా ?

వ్యవస్థని మార్చాలన్న అభిప్రాయం ప్రక్కన పెట్టు. దాన్ని నువ్వెలానూ మార్చలేవు. ప్రస్తుతం వున్న పెట్టుబడిదారి వ్యవస్థలో పోటీతత్వం నేర్చుకో. మధ్యతరగతి మనస్తత్వం వదిలిపెట్టు. మిగతా వారిని అధిగమించి, నువ్వెలా నెం. 1 అవ్వాలో ఆలోచించు. అంతేకానీ నీ చేతగానితనానికి మంచితనమని, నీకు లౌక్యం తెలియక పోవటమే నీ గొప్పతనమనీ, నీవిలా అట్టడుగున వుండిపోవటానికి కారణం సమాజమనీ – తప్పుడు అభిప్రాయంతో మగ్గిపోకు. అన్నిటికన్నా ముఖ్యంగా, జీవితంలోకి పైకి రావాలంటే, ఇతరుల్ని మోసం చెయ్యాలనో, తప్పులు చెయ్యాలనో అనుకోకు! ★★★

→•←

మానవుల్లో వ్యత్యాసం తప్పదు!! దేవుళ్ళలోనే వ్యత్యాసాలున్నాయి!! ★

→•←

ఆదిలో మానవులు, కేవలం పంచభూతాల్ని, ముఖ్యంగా అగ్నిని పూజించేవారు. తరువాత వచ్చింది గుడి. అసలు 'గుడి' అన్నదే పెట్టుబడిదారీ వ్యవస్థకి చిహ్నం!! ★★

→•←

ఒక ఆటంకం వచ్చిందీ అంటే, నీలో ఒక బలహీనతని అది బయట పెడుతోందన్నమాట. ఆ బలహీనతని గుర్తించు. ★★

→•←

తన ఆలోచనా దృక్పథాన్ని బట్టి, ప్రతి మనిషీ తన గమ్యాన్నీ జీవితాశయాన్నీ నిర్దేశించుకుంటాడు. దానికి అనుగుణంగానే జీవిత విధానాన్నీ ఫిలాసఫీనీ నిర్మించుకుంటాడు. అయితే కొంతమంది దురదృష్టవంతులు మాత్రం తమ గమ్యాన్ని ఒక విధంగా, జీవిత విధానాన్ని వేరే విధంగా ఉంచుకుంటారు. ఐ.ఏ.యస్ చదవాలనుకుంటూ రోజుకు రెండు సినిమాలు చూడటం లాటిదన్నమాట. ★★★

→•←

మీ దృష్టిలో నెంబర్ వన్ ఎవరు? ఒక దేవత ప్రత్యక్షమై మిమ్మల్ని నెంబర్ వన్ చేస్తానంటే మీరు ఎవరిలా అవ్వాలని కోరుకుంటారు. ఆ రెండు పేర్లూ ఒకటే అయితే మీ 'ఇష్టమూ', మీ 'గమ్యమూ' ఒకటే అన్నమాట. ★★

→•←

ప్రతి గమ్యాన్ని చేరుకోవడంలోనూ, "నేను కష్టపడుతున్నాను" అన్న ఫీలింగ్ వున్నవాడు జీవితంలో ఎప్పుడూ నెంబర్ వన్ కాలేడు. ★★★★★

→•←

తర్కం తప్ప మనిషి జీవితంలో మరేదీ లేదు. మనిషి యొక్క విలువలన్నీ తర్కం మీదే ఆధారపడి వున్నాయి. తుమ్ము, పిల్లి శకునం, తర్కానికి నిలబడవు. అదే విధంగా తనకొక స్త్రీతో పరిచయం వున్న మొగాడు, తన భార్యకి ఒక పురుషుడితో సంబంధం వుంటే సహించలేడు. ఎందుకిలా – అని ప్రశ్నిస్తుంది తర్కం (LOGIC) ★★★★

→•←

మా తత్వం వాస్తవం. అంటే ఎవరో నిర్దేశించింది గానీ, ఎవరో చెప్పిందిగానీ మేము ప్రతిపాదికగా తీసుకోము. ఒకవేళ తీసుకున్నా – దాన్ని మా అనుభవంతో, మా జ్ఞానంతో పరిశీలించి నిజానిజాలు గ్రహిస్తాం. చావు తద్దినం నుంచీ బాల్య వివాహం వరకూ – మా పూర్వీకులు తమ తమ ధర్మాలకు అనుగుణంగా ఏర్పరుచుకున్న నియమాల్ని, ఒప్పుకోవాలా లేదా అన్నది, ప్రస్తుత సమాజానికి దాని అవసరం, వాటి ద్వారా ఉండే కష్టనష్టాల్ని స్వయంగా పరిశీలించిన తర్వాతే మేము నిర్ణయించుకుంటాం! ★★★★

→•←

టైటానిక్ సినిమా చివర క్లైమాక్స్‌లో సముద్రంలో ఓడ మునిగిపోతూ వుంటే, కొందరు ప్రయాణీకులు బ్రతకాలన్న ఆశతో పై వైపుకి (?) పరుగెడతారు. మరి కొంతమంది పై నుంచి నీళ్ళలోకి దూకేస్తారు. మరి కొంతమంది లైఫ్ బోట్లలోకి దూకుతూ ఉంటే, మరి కొంతమంది ఓడ మీదే ఫిడేలు వాయిస్తూ చచ్చిపోతున్న వారికి అంతిమ గీతాలాపన చేస్తారు. కథకి అవసరం కాబట్టి – చివర్లో హీరోయిన్ పడుకోడానికి వీలుగా దర్శకుడు ఒక బల్ల తయారు చేస్తాడు.

అది కథ. కానీ నిజ జీవితంలో మనకి అలా బల్ల తయారు చేసే వాళ్ళు ఎవరూ వుండరు. మునిగిపోతున్న ఓడ మీద నుంచి ఎప్పుడు నీళ్ళలోకి దూకాలి? దేన్నీ అసరా తీసుకోవాలి? ఎలా ఆ ప్రమాదం నుండి బయటపడాలి? అన్నది ఆ మనిషి యొక్క సమయస్ఫూర్తి మీద, తెలివితేటల మీద, ప్రమాదాన్ని అంచనా వేయగల అతడి ఊహాశక్తి మీద, భవిష్యత్తుని నిర్దేశించగలిగే అతడి ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

అప్పుడు అతడు నెంబర్ వన్ అవుతాడు. ★★★

→•←

మనిషి యొక్క కష్టం మీదనూ, తెలివితేటలమీదనూ అతడు ఎంత సుఖంగా బ్రతకాలి అన్నది నిర్దేశింపబడాలి. అంటే, తెలివైన మనిషి ఎంత కష్టపడితే అంత సుఖాన్ని కోరుకునే హక్కు అతడికి వుంటుంది ★★★★

→•←

"తృప్తి" అనేది Material Benefit కాదనుకోవటమే ఆత్మవంచన. దాని కోసం ఎంత ఖరీదు చెల్లిస్తున్నామని తెలుసుకోవటమే జ్ఞానం. ★★★

→•←

పెర్సోనా అంటే మాస్క్ (ముసుగు) 'పెర్సనాలిటీ' అన్నపదం అందులోంచి వచ్చిందే. మన ప్రవర్తనమీదా, హృదయం మీదా ఒక్కసారి ముసుగు వేసుకోవటం మొదలు పెట్టిన తర్వాత, నిరంతరం అది జారిపోకుండా ఉంచుకోవడానికీ ప్రయత్నించవలసి వస్తుంది. మన లోపలి పెర్సనాలిటీ, మన మొహం మీద వేసుకున్న ముసుగు (persona) ఒకటే అయినప్పుడు – మాటిమాటికీ జారిపోతున్న మాస్క్‌ని కష్టపడి తిరిగి ధరించవలసిన అవసరం వుండదు. మనల్ని ఇష్టపడే వాళ్ళు ఇష్టపడతారు – లేనివాళ్ళు దూరంగా వెళ్ళిపోతారు. ★★★★

→•←

మనపట్ల అవతలివారి అభిప్రాయాలూ, వాదనలూ, మాటలూ.... అన్నీ వారి వారి వర్తమాన (లేటెస్టు) అనుభవాల మీద, మన వల్ల వారికొచ్చే లాభాలమీదా ఆధారపడి వుంటాయి. ★★★

→•←

ఇతరులకి నష్టం లేకుండా మనకేది బావుంటుందో మనం నిర్ణయించుకోవటమే Constructive Materialism. సెంటిమెంటులిస్టులు దీనికి వప్పుకోరు. ★★★

→•←

ఈ ప్రపంచంలో కష్టమయిన పని అంటూ ఏదీలేదు. మనకి అదంటే ఇష్టం లేకపోవటం వలన అది 'కష్టం' గా మారుతుందంతే. ★★★★★

→•←

"ఇంతకన్నా పైకి అనవసరం. ఇక్కడ నేను ఆనందంగానే వున్నాను" అని మనిషి ఏ స్థాయిలో అనుకున్నాడో – ఆ స్థాయి – అతడి సమర్థతకి ఉచ్ఛస్థాయి. అంతే, అక్కడినుంచీ అతడి శక్తి క్రమంగా అసమర్థత (లేక బద్ధకం) లోకి దిగిపోతుంది. రొటీన్‌గా బ్రతకటం అలవాటవుతుంది. ★★

→•←

1) ఇష్టపడి పనిచేసే వాళ్ళు

2) తమ సమయం విలువ తెలుసుకున్న వాళ్ళు

3) ఏ రంగంలో తమకి నైపుణ్యం వున్నదో కరెక్టుగా గ్రహించిన వాళ్ళు – మాత్రమే సుఖంగా బ్రతకగలుగుతారు ★★

→•←

తన మెదడుని సమర్థవంతంగా వాడుకోవటం మానేసి, మనిషి మనసు చేసే పన్లని ఆనందించటానికి ఉపయోగిస్తాడు. ఈ పరిణామక్రమంలో క్రమక్రమంగా 'మెదడు' ఆలోచించటం మానేసి, మనసుతో చేరి ఆనందించటం ప్రారంభిస్తుంది. ఇది చాలు అనుకుని ఎదగటం మానేస్తుంది. తర్కం నశిస్తుంది – అదే కంఫర్ట్ జోన్!! ★★

→•←

తనకు తెలిసిన విషయం నుంచి – మరొక క్రొత్త విషయం తెలుసుకోవటానికి ఆలోచించగల శక్తి "మనిషి" మెదడుకి మాత్రమే వుంది! ★★★★

→•←

మరొకరు హీరోగా నటించే చిత్రంలో సైడ్ కారెక్టర్ కాదు. మీ జీవిత చిత్రంలో మీరే హీరో. ★★★★★

→•←

కొంత మంది ఎప్పుడూ చిరాగ్గా వుంటారు. ఎప్పుడూ విసుగే. ఇండియా క్రికెట్‌లో ఓడిపోవటం, రాజకీయాలు, తరచు పవర్ ఫెయిల్యూరు, రైళ్ళు టైమ్‌కి రాకపోవటం – వీరి కోపానికీ, దుఃఖానికీ ఇలాంటి కారణాలు చాలా వుంటాయి. తరచు వీరి నోట వెంట, "....ఈ దేశం బాగుపడదు .....ఈ వ్యవస్థ ఇంతే" లాంటి మాటలు వినపడతాయి. ★★★

→•←

ముందు నీ గమ్యం ఏమిటో నిర్ణయించుకో. ఆ తరువాత ఎలా దాన్ని సాధించాలో వివిధ రకాలుగా ప్లాన్ చెయ్యి. ★★

→•←

ఒక ఓటమి సంభవించినప్పుడు గెలిచేవాడు ఆ ఓటమికి కారణాలు వెతుకుతాడు. ఓడేవాడు దానికి పదింతలు టైము, ఏడవటంలో గడుపుతాడు. ★★★

→•←

మనిషి ధ్యేయం ఎప్పుడూ ఒక్క అడుగు దూరంలోనే ఉంటుంది. కొందరు మాత్రమే అక్కడకు చేరుకుంటారు...... అడుగు వేసి అలసిపోని వాళ్ళు!!! ★★★★★

→•←

చదువు పూర్తయి ఇంట్లోంచి బయటికి వచ్చాక కనపడే మొదటి శత్రువు – "వాస్తవం" ★★★

→•←

యుద్ధంలో తాను గెలవటం ఎంత ముఖ్యమో, అవతలివాడు ఓడిపోవటం కూడా అంతే ముఖ్యం. లేకపోతే పక్కలో బల్లెంలా నిలుస్తాడు. ★★

→•←

నీకు హాని చేసేది "బలహీనత". నీ వల్ల ఇతరులకి హాని జరిగితే అది "తప్పు". నీకు గానీ ఇతరులకి గానీ హాని జరగని పని, నీ సంతృప్తి కోసం నువ్వేది చేసినా పర్వాలేదు. ★★★★★

→•←

మనిషికి అధ్యాత్మిక చింతన అవసరమే. కానీ అదే జీవితం కాకూడదు. అది జీవితంలో ఒక భాగం మాత్రమే! "నీ కర్మ నువ్వు నిర్వహించు" అని భగవంతుడే చెప్పాడు. మరి అటువంటప్పుడు ఈ ప్రపంచంలో చాలా మంది తమ కర్మ తాము నిర్వర్తించకుండా 'ఖర్మ' అని ఏడుస్తారెందుకు? ★★★★

→•←

ఎవరెంత తీసుకున్నా సరే – ఈ ప్రపంచంలో 'సంపద' ఇంకా మిగిలే వుంటుంది. ఎలక్ట్రానిక్ రంగంలో అంత సంపద వున్నదని మొన్నటి వరకూ ఎవరికీ తెలీదు కదా! అదే ఆర్థిక స్పృహ!! ★★

→•←

"ఒక్కసారి డబ్బు రావటం మొదలు పెడితే అది ప్రవాహం లాగా, ఉప్పెన లాగా వచ్చేస్తుంటుంది. ఇంత డబ్బు ఈ ప్రపంచంలో ఇంతకాలం ఎక్కడుందా అని మనం ఆశ్చర్యపడేలా మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది." ★★

→•←

ఒక నామవాచకానికి మంచి విశేషణాన్ని అన్వయించటమే పాజిటివ్ థింకింగ్ అంటే!!! ★★★

→•←

మన జీవిత గృహాల్లోకి ఎందరో వస్తూ పోతూ వుంటారు. కొందరే, మనల్ని ప్రభావితం చేసే పరిమాళాన్ని వదిలి వెళ్తారు. ★★

→•←

తన గురించి 'మెదడు'తో ఆలోచించి, ఇతరుల గురించి 'మనసు'తో ఆలోచించగలిగినవాడే నెం. 1 కాగలడు. ★★★★★

→•←

కోపం, ప్రమాదం – రెండింటి చివరి అక్షరమూ ఒకటే, వాటి వల్ల మిగిలేది కూడా అదే!.... "సున్నా"!! ★★

→•←

గొప్పవాళ్ళు వ్యూహాల గురించి, మధ్యములు సంఘటనల గురించి, అధములు వ్యక్తుల గురించి మాట్లాడతారు. ★★

→•←

భవిష్యత్తుని ముందుగా ఊహించగలిగేవాడు. ఆ పరిణామాల్ని కరక్టుగా పట్టుకోగలిగేవాడూ, అందరికన్నా విభిన్నంగా ఆలోచించగలిగేవాడూ ఎప్పుడూ సక్సెస్ అవుతూనే వుంటాడు. ★★

→•←

ఒంటరితనంలో బాధపడతావు – నిన్ను నువ్వు ప్రేమించటం నేర్చుకునే వరకూ.
ఓటమిని చూసి భయపడతావు – ప్రయత్నం గురించి తెలియనంత వరకూ.
గెలుపంటే కూడా భయమే – అదిచ్చే ఆహ్లాదం వూహించలేనంత వరకూ.
చీకటిని చూసి కళ్ళు మూయకోయ్ – నక్షత్రాలు కనపడే వేళ అది.
వెలుగుని చూసి వెనుదిరగకోయ్ – సత్యం స్నేహ హస్తం సాచే సమయమది.
గమ్యం వైపు అడుగువేస్తూ – దూరాన్ని చూసి భయపడితే ఎలా?
గొంగళి పురుగై పుడితేనేం – దాని గమ్యం సీతాకోకచిలుకే కదా! ★★★★

→•←

అడవిలో ప్రజ్వలించే నిప్పుకి గాలి మరింత సాయం చేస్తుంది. అదే గాలి, కొడిగట్టే క్రొవ్వొత్తిని చప్పున ఆర్పేస్తుంది. గెలిచే చోట మిత్రులుంటారు. ఆపదలో ఎవరూ రారు. ★★

→•←

మనిషికుండాల్సిన అన్ని విలువల్లోనూ, నా దృష్టిలో ప్రముఖమైంది "ఆహ్లాదం". దీన్ని ప్రథమ స్థానంలో ఎందుకు పెడుతున్నానంటే, తన జీవితాన్ని తాను ఆహ్లాదంగా జీవించలేని వ్యక్తి, ఇతరులకి ఒక బరువుగా తయారవుతాడు. ★★

→•←

వ్యక్తుల్ని ప్రేమించే కొద్దీ, వారి నుంచి దూరమైతే విరహం. వారికి కోపం వస్తే బాధ. వారు వేరే వారి పట్ల కాస్త ఎక్కువ శ్రద్ధ చూపితే ఈర్ష్య....! అదే ప్రాణం లేని (సంగీతం, పెయింటింగ్, రచన, పఠనం వగైరా) వాటి పట్ల అభిరుచి పెంచుకుంటే మనకి మనమే వాటితో రమించవచ్చు. అవి అలగవు. కోర్కెలు తీర్చమని బలవంతపెట్టవు. మరికొంత సమయం తమ కోసం కేటాయించమని అడగవు. అందుకే ప్రకృతితో స్నేహం ఎల్లప్పుడూ నిరపాయకరం. ★★

→•←

విషాదం అంతా బంధం వల్ల వస్తుంది అని తెలుసుకోగలగటమే జ్ఞానం. కోరికపట్ల, మనుష్యులపట్ల బంధాన్ని, కరెక్టు స్థాయిలో పెంచుకుని, అవసరమైనప్పుడు తెంచుకోగలిగే వాడిని వివిధ రకాలయిన విషాదాలు దరిచేరవు. ★★★★

→•←

నిన్నటి ఓటమి గురించి చింతని, రేపటి సాయంత్రపు దిగులుగా మారనివ్వకు. ఈ రోజుని అనుభవించు. ★★★★★

→•←

డబ్బుకోసం దేన్ని వదులుకోవాలో అజ్ఞానికి తెలుస్తుంది. దేనికోసం డబ్బుని వదులుకోవాలో జ్ఞానికి తెలుస్తుంది. ★★★★

→•←

".....వర్తమానంలో ఎంత శాతం సుఖాన్ని భవిష్యత్ కోసం త్యాగం చెయ్యాలి?" అని ఆలోచించటమే ప్లానింగ్. ★★★

→•←

భార్యభర్తల మధ్య జీవన విధానాలు, నమ్మకాలూ, అలవాట్లూ, అభిరుచులూ, మొదట్నుంచీ వేర్వేరుగా వుంటే, ఆ దుర్భర జీవితం అనుభవించటం కన్నా, విడిపోవటం మంచిది. దీన్ని చాలామంది ఛాందసవాదులు వొప్పుకోరు. రాజీ పడమంటారు. రాజీపడితే మంచిదే. కానీ AT WHAT COST? అన్ని సుఖాలూ వదులుకుని..... దుర్భరమైన దాంపత్యం గడపటం కోసం కాదు రాజీపడాల్సింది. ★★★

→•←

"....నీకున్న దానితో నువ్వేం చేస్తావో, అది నువ్వు." ★★

→•←

వంద సంవత్సరాల తరువాత మనుష్యులు ఎలా బ్రతుకుతారో, మేధావులు ఈ రోజు అలాంటి ఆలోచనల్తో బ్రతుకుతారు. ★★

→•←

40 ఏళ్ళ తండ్రి. మోటర్ సైకిల్ కావాలంటున్న తన 16 ఏళ్ళ కొడుకుతో, "....నాలుగు సంవత్సరాలు ఆగు, కొనిస్తాను" అన్నాడనుకుందాం. తండ్రి వయసులో, నాలుగేళ్ళంటే పదో వంతు. అంటే 10శాతం. కానీ కొడుకు వయసులో..... ? అతడి వయసులో అది నాలుగో వంతు. అంటే 25 శాతం.

అంటే, తండ్రికి అనిపించిన దానికన్నా రెండున్నర రెట్లు భారంగా, కొడుకు రోజులు గడుస్తాయన్నమాట. అంటే, ఆ నాలుగు సంవత్సరాలూ పదేళ్ళ సుదీర్ఘ కాలంలా అనిపిస్తుంది కొడుక్కి. ★★

→•←

మనిషి తన కిష్టమయిన మార్పుని ఊహించని వేగంతో స్వీకరిస్తాడు. ఇష్టం లేనిమార్పు, ఎంత మంచిదయినా తప్పని సరి అయినా, వాయిదా వేయటానికి ప్రయత్నిస్తాడు. ★★

→•←

బుద్ధుడు విగ్రహారాధన వద్దన్నాడు. అదే విధంగా జిడ్డు కృష్ణమూర్తి ".....దేవుడితో మనిషికి అవసరం లేదనీ, ఏ మనిషయినా తనకి తానే జవాబుదారి" అనీ అన్నాడు. ఈ సిద్ధాంతాలన్నీ అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఎందుకంటే మనిషి సాధారణంగా పిరికివాడు. కష్టం కలిగినప్పుడు ఎక్కడో ఒకచోట ఆధారపడాలి. అదీ కారణం. ★★★

→•←

నీ సమస్యకి కారణం 'ఇతరులు' అని నువ్వు అనుకుంటే వారిని మార్చాలి. నువ్వే నీ సమస్య అనుకుంటే నువ్వు మారాలి. ఏది సులభమో ఆలోచించు. ★★★★

→•←

గెలుపులో వచ్చే సంతోషం కన్నా, ఓడిపోతామేమో నన్న భయం ఎక్కువ వున్నవారు సామాన్యులుగా వుండిపోతారు. ★★★

→•←

యవ్వనంలో కాలుమీద కాలు వేసుకుని కదలకుండా వుండటం పక్షవాత లక్షణం. ★★★

→•←

యజమానుల పట్ల వర్కర్లకి ఈర్ష్యా భావం వుంటుంది. వాళ్ళని తిడతారు. మళ్ళీ వాళ్ళక్రిందే పనిచేస్తారు. వాళ్ళలా మారటానికి ప్రయత్నించరు. లేదా, తమలో లేనిది, ఆ యజమానుల్లో వున్నదని ఒప్పుకోరు. తాము ఎక్స్‌ప్లాయిట్ కాబడుతున్నాము అన్న భావన, వర్కర్లకి సంతృప్తినిస్తుంది. తిట్టుకుంటూ, సణుక్కుంటూ జీవితాన్ని గడిపేస్తారే తప్ప, వేరు మార్గాన్ని అన్వేషించరు. మరీ కోపం వస్తే స్ట్రయిక్ చేసి, కాస్త జీతం పెరగ్గానే, అదే గెలుపు అని సంతృప్తిపడతారు. ★★

→•←

అవతలి వారిని ఎప్పుడయితే '....నీ' Values తో చూసావో, అప్పుడు, వారు నీకు అదే విధంగా కనపడతారు. ఉదాహరణకి, ఒక అద్భుతమైన మేధావి వున్నాడనుకో! అన్ని రంగాల్లోనూ అతడు నెం.1. కానీ అతనికి వున్న ఒకే వ్యసనం తాగుడనుకో!! నీకు తాగుడంటే అస్సలు ఇష్టంలేదు. అప్పుడు అతడి గురించి ఇంకెవరయినా చెప్పవలసి వస్తే నీ దృక్పథంతో చెప్తావు. అంతే తప్ప అతడి '....అర్హత' బట్టి కాదు. అతడో తాగుబోతు అంటావు. అతడి '....మిగతా' గొప్పతనం ఏది గుర్తించవు. నీ జడ్జిమెంటు అది! అందులో కాస్త అసూయ కూడా వుంటుంది అనుకో....! ★★

→•←

"ఈ ప్రపంచంలో నిరంతరం దుఃఖించేవారు ఆరుగురు. ఈర్ష్యాళువులు, జుగ్గుప్సావంతులు, నిస్సంతోషులు. క్రోధనులు. నిత్యశంకితులు, పరభాగ్యోప జీవులు." ★★★

→•←

నమ్మకం బలాన్ని ఇస్తుంది. తర్కం జ్ఞానాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచంలో జ్ఞానం కన్నా నమ్మకానికి డిమాండ్ ఎక్కువ. అయితే, భగవంతుడు నిజంగా వున్నాడని నమ్మే వారిలో కొందరు, భగవంతుడి ఆదేశాలకీ, నైతిక సూత్రాలకీ కట్టుబడి వుండరు. చేయవలసిన పాపాలు చేస్తూనే భగవంతుని పూజిస్తారు. ఈద్వైదీభావానికి కారణం ఎవ్వరూ చెప్పలేరు కూడా. పాపం చేస్తున్న వాడి మొహం ఆనందంగా వుండొచ్చుగాక! కానీ ప్రశాంతంగా మాత్రం వుండదు.★★

→|•|←

మనిషి యొక్క జ్ఞానమంతా అతడి దృక్పథం (Outlook) మీద ఆధారపడి వుంటుంది. దృక్పథం మారితే స్టాండర్డ్ మారుతుంది. ★★

→|•|←

న్యాయం వున్న ప్రతిచోటా తృప్తి వుండాలని రూలు లేదు. ★★

→|•|←

నెం.1 అవటమంటే అమితమైన ధనమూ, అంతులేని అధికారమూ సంపాదించటం కాదు. డబ్బు, కీర్తి, అధికారం, ప్రేమ, మానవ సంబంధాలు అనే అయిదు అంశాల్ని సంపాదించటానికి '....తృప్తి'ని ఖర్చుపెడుతూ వుంటాడు సామాన్యుడు. తృప్తిని స్టాండర్డ్‌గా పెట్టుకుని, దాన్ని పెంచుకోవటానికి డబ్బు, కీర్తి, అధికారం, ప్రేమ, మానవసంబంధాల్ని ఆధారం చేసుకుంటాడు నెం.1. అదే తేడా. ★★★★★

→|•|←

ప్రపంచంలో దేని విలువ నిర్ధారించాలన్నా, "మనిషి" ప్రస్తుత (వర్తమాన) పరిస్థితినే ప్రామాణికంగా తీసుకోవాలి. అంటే, కాలం, ప్రదేశం, మనస్తత్వం బట్టి "విలువలూ – వాటి అర్థాలూ" మారుతూ వుంటాయి. ఈ లోకంలో స్పష్టమైన

సత్యం అంటూ ఏదీ శాశ్వతంగా వుండదు! నిర్ధారితమైన స్టాండర్డ్ ఏమీ లేవు!! మంచి – చెడు, న్యాయమూ – సత్యము, అందమూ – వికారమూ అన్నీ రిలెటివే!!! అవి కాలాన్ని బట్టి, ప్రదేశాన్ని బట్టి మారుతూ వుంటాయి. తెలివైన వారు మాత్రమే వీటిని ముందుగా గ్రహిస్తారు. ★★★★

⇥•⇤

వరస గెలుపుల సముదాయమే విజయం. గెలుపుని ఒక వ్యసనం చేసుకుంటే, ఆ అలవాటు '....విజయం'గా మారుతుంది. ★★★

⇥•⇤

జీవితపు బ్రాండింగ్‌కి అర్థం ఒక్క వాక్యంలో చెప్పాలంటే "నీ చుట్టూ వున్న సమాజమూ, వ్యక్తులూ నీకిస్తున్న ప్రాముఖ్యతకి సరిపడా విలువ, నీ దగ్గిర వున్నదన్న నమ్మకాన్ని వారికి కలుగజేయటం." ★★★

⇥•⇤

" 'గెలుపు' అంటే, నిన్నటి సంతోషానికి ఈ రోజు వచ్చి చేరిన సంతోషం. అందుకే తృప్తికి '....కామా'లే గానీ ' ....పుల్‌స్టాప్' లుండవు. " ★★

⇥•⇤

ఒక సిగరెట్ నలిపి మేక ముక్కు దగ్గిర పెట్టండి. ఒక్క ఉదుటున ఎగిరి గంతేసి దూరంగా, పారిపోయి వెనక్కి తిరిగి, '....నువ్వో వెధవ్వి' అన్నట్టు చూస్తుంది. మొదటిసారి సిగరెట్ త్రాగే కుర్రాడిని కూడా అతడి శరీరం ఇలాగే తిరస్కరిస్తుంది. దగ్గు, ఛీత్కారం, కళ్ళల్లో నీళ్ళు వామిటింగ్‌ల ద్వారా '....నీకిది పడదు' అని సంకేతాలు పంపుతుంది. అయినా వినకుండా ఆ వ్యసనాన్ని అలవాటు చేసుకుని కొనసాగిస్తే ఏమవుతుంది? అతడి శరీరం అతడిని నమ్మటం మానేస్తుంది. ★★

⇥•⇤

భగవంతుడు నీ కోర్కె తీర్చాడూ అంటే, తనమీద నీ నమ్మకం పెంచుతున్నాడన్నమాట. తీర్చటానికి ఆలస్యం చేస్తూ వున్నాడంటే నీ ఓర్పుని పెంచుతున్నాడన్నమాట. తీర్చలేదంటే, అతడికి నీ శక్తిమీద (తన సాయపు అవసరం నీకు లేదన్న) నమ్మకం వుందన్నమాట. ★★★

→•←

విజయానికి ఆరో మెట్టు

"గెలుపు వద్దనుకునేవాడికీ, గెలిచి వద్దనుకునే వాడికీ" తేడా మోక్ష సన్యాసం. ★★

★★★

→•←

ఏ పుస్తకమూ తానంతతాను మనిషిని మార్చలేదన్నది ఎంత వాస్తవమో, ప్రతి మనిషీ తనని తాను మార్చుకోగలడన్నది అంతే వాస్తవం. ★★★★

→•←

ఏ పనిచేసినా 1. త్రికరణ శుద్ధిగా 2. ఫలితము ఆశించకుండా 3. భవబంధము నొదిలి చేయటమే మనిషి కర్తవ్యము అని చెప్పిన గ్రంథం భగవద్గీత. ★★★

→•←

చేస్తున్న పనిలో ఆనందం దొరకటం కొద్దిమందికి మాత్రమే లభించే అదృష్టం. అయితే అటువంటి పనిని వెతుక్కోవటం అంత కష్టమేమీ కాదు. కాస్త కృషి చేయాలంతే, కృషి చెయ్యనివారు ఎస్కేపిస్టులు అవుతారు. ★★

→•←

అస్పష్ట అపజయం చాలా రకాలుగా సాగుతుంది. పిల్లలపట్ల అవసరమైన దానికంటే ఎక్కువ ప్రేమ, వారి చదువు పట్ల విపరీతమైన ఆందోళన, జీవితంలో ఏ విధమైన వెరైటీ లేకపోవడం, గంటల తరబడి టి.వి. వీక్షణం అస్పష్ట అపజయాలకు గుర్తులు. తాను చేస్తున్న పని పట్ల కుతూహలమూ, ఇంటరెస్టు లేకపోవటం వల్లనే ఇదంతా జరుగుతుంది. ★★

→•←

మనిషికి ధైర్యాన్నిచ్చేదీ, ధైర్యాన్ని పోగొట్టేదీ కూడా భవబంధమే. ★★★

→•←

మనిషి మంచి మనుగడే మతము యొక్క అభిమతము. ప్రజల్లో అసంతృప్తి పెరిగీ, అభిలాషలో మార్పు వచ్చినప్పుడల్లా ఒక మతం జన్మించింది. ★★

⇥•⇤

ఒక తోటమాలి వున్నాడు. మల్లెపొదలు నాటాడు. భూమిని నీళ్ళతో తడుపుతూ మట్టివాసన ఆనందించాడు. పొదలు మొగ్గలు తొడుగుతూ వుంటే, ఆ సుందరదృశ్యాన్ని చూసి సంతోషించాడు. ఆ సువాసనల మధ్య సాయంత్రాలు ఆహ్లాదంగా గడిపాడు. మొగ్గలు విచ్చుకుంటున్న సమయంలో వాటిని అమ్మి జీవనాధారం సంపాదించుకున్నాడు. అది ఫలితము. మొదటిదంతా కర్తవ్యము. కర్తవ్య నిర్వహణమే ఆనందము. చివరి ఫలితమొక్కటే ఆనందం కాదు. ★★★

⇥•⇤

అసమర్థుల్నీ, నిరాశావాదుల్నీ మీ చుట్టూ వుంచుకోకండి. వారు పైకి రావటానికి బదులు, వారితో పాటు మిమ్మల్ని క్రిందికి లాగటంలో ఆనందం పొందుతారు. వారితో వాదించవద్దు. గెలవలేరు కూడా. నవ్వి వూరుకోండి. దూరంగా వచ్చెయ్యండి. మూర్ఖుడు మాత్రమే పందుల్తో మల్లయుద్ధం చేస్తాడు. ★★

⇥•⇤

క్రికెట్‌తో బంధం విద్యార్థిని చదువుకి దూరం చేస్తుంది. స్నేహితుల్తో బంధం తండ్రిని ఇంటికి ఆలస్యంగా వచ్చేటట్టు చేస్తుంది. టి.వి.తో బంధం గృహిణిని సోమరిపోతుని చేస్తుంది. ప్రేమతో బంధం అవివాహితని గర్భవతిని చేస్తుంది.★★

⇥•⇤

మనిషి 'ప్రేమ'తో బంధం పెంచుకోవాలి. 'స్వార్థం'తో బంధం తెంచుకోవాలి. ★★

⇥•⇤

న్యాయం వేరు. నష్టం వేరు. నష్టం జరిగిన వారివైపే న్యాయం వుండాలని రూలు లేదు. ★

→•←

'పుస్తకం' ముందు పాఠం చెప్పి తరువాత పరీక్ష పెడుతుంది. 'అనుభవం' ముందు పరీక్ష పెట్టి, దాని ద్వారా పాఠం నేర్పుతుంది. ★

→•←

మూర్ఖుడు తన అనుభవం ద్వారా కూడా జ్ఞానాన్ని గ్రహించలేడు. సామాన్యుడు స్వానుభవం ద్వారా పాఠం నేర్చుకుంటాడు. తెలివైనవాడు ఇతరుల అనుభవం ద్వారా జ్ఞానం పొందుతాడు. నిజమైన జ్ఞానికి అనుభవం అవసరం లేదు. ఆలోచన ద్వారానే సత్యాన్ని గ్రహిస్తాడు. ★★

→•←

ఎక్కడయితే 'స్వార్థం' లేదో అక్కడ 'నష్టం' లేదు. ★★★★★

→•←

ఇద్దరికీ లాభం వచ్చే స్వార్థం సహేతుకం. కేవలం తన లాభం చూసుకోవటం సాధారణ స్వార్థం. తన లాభం కోసం అవతలి వారికి అన్యాయం చెయ్యటం అధమ స్వార్థం. తనకి లాభం లేకపోయినా ఇతరులకి అన్యాయం చేయటం నీచాతి నీచమయిన స్వార్థం. ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం, రూమర్లు వ్యాప్తి చెయ్యటం – చివరి విభాగంలోకి వస్తాయి. ★★

→•←

తన జీవితం పట్ల తమకి అసంతృప్తి వున్న మనుష్యులకే అభద్రతా భావం, కోపం, దుఃఖం ఎక్కువగా వుంటాయి. ★★

→•←

ప్రకృతితో పోరాడని చెట్టు, మరిన్ని సూర్యకిరణాల కోసం విస్తరించని చెట్టు, కేవలం వర్షం నీటితో సంతృప్తిపడే చెట్టు, అడవికి రారాజు ఎప్పటికీ కాలేనట్టు – గాలికెదురు నిల్చిన చెట్టు, నీటికోసం వేళ్ళతో భూమిని చీల్చిన చెట్టు, నక్షత్రంతో మాట్లాడటం కోసం నింగికెదిగిన చెట్టు మనిషెలా బ్రతకాలో మనకి పాఠం చెప్పినట్టు..........! ★★★

⇥•⇤

మనిషి 'ప్రవర్తన'కి ఇద్దరు కూతుళ్ళు పుట్టొచ్చు. ఒక కూతురు పేరు 'ధైర్యం' మరొక కూతురు పేరు 'కోపం'. పరిస్థితులు అలా వున్నందుకు 'కోపం'. పరిస్థితులు అలా లేకుండా చేసుకోగలిగేది 'ధైర్యం'. ★★

⇥•⇤

ధైర్యం, వివేకం కలిస్తే వచ్చేది గెలుపు. ఆ రెండూ వేర్వేరు అని తెలుసుకోవటం జ్ఞానం. జలపాతం పై తాడుకట్టి, దానిమీద నడవటం ధైర్యం. అలా చెయ్యకుండా వుండటం వివేకం. ★★

⇥•⇤

భయపడకుండా ఎదిరించటం ధైర్యం. భయపడవలసిన దానికి భయపడటం వివేకం. ★★★★★

⇥•⇤

ఆనందంగా ఇచ్చేది 'దానం'. ఇష్టమైనదాన్ని ఇచ్చేది 'త్యాగం'. అవసరమైన దానికోసం, ఇష్టమైన దాన్ని కోల్పోవటం 'కష్టం'. ★★

⇥•⇤

రెండు విరుద్ధమైన సుఖ స్థితుల మధ్య ఇష్టమైన స్థితిని వదలుకోవలసి రావటమే దుఃఖం. అదే 'కష్టం' అంటే. ★★

⇥•⇤

నీకు తెలిసిన దీపపు కాంతితో కొంతదూరం వచ్చాక, నీకు తెలియని దట్టమైన చీకటి ప్రపంచం ప్రారంభం అవుతుంది. అంచు మీద నిలబడ్డావు. మరో అడుగు ముందుకేస్తే ఏం జరుగుతుందో, క్రింద ఏముందో నీకు తెలీదు. 'ధైర్యం' అంటే ఈ క్రింది రెండిటిలో ఒకటి జరుగుతుందన్న నమ్మకం.

1. నువ్వు నిలబడటానికి క్రింద ఏదన్నా తగలొచ్చు. (లేదా) 2. ఎగరటం ఎలాగో నువ్వు నేర్చుకోవచ్చు. ★★★★

→•←

ఒక ఇష్టమైన పనిచేస్తూ, చేయవలసిన పని చేయకపోవటమే 'బద్ధకం' అంటే.★★

→•←

బద్ధకానికీ, నిర్లక్ష్యానికీ కలిపి పుట్టిన బిడ్డ – కంఫర్ట్ జోన్. ★★

→•←

ఇంతకన్నా మంచిగా ఎలా బ్రతకొచ్చో నిరంతరం తెలుసుకుంటూ వుండటమే జీవితం. ★★★★★

→•←

తాత్కాలికంగా ఏ కష్టమూ లేకపోవటం కంఫర్ట్ జోన్. భవిష్యత్తులో కూడా ఏ కష్టాల్లేకుండా ప్లాన్ చేసుకోవటం జ్ఞానం! ★★★★

→•←

డబ్బు చెడ్డది కాదు. అయితే, డబ్బు సంపాదించే పద్ధతులు చెడ్డవి కావొచ్చు. ★★

→•←

ప్రజల్లో, 'చరిత్ర చదివేవారు, చరిత్ర సృష్టించేవారు' అని రెండు రకాలుగా వుంటారు. ★★

→•←

ఈ క్షణం నువ్వు పనిచేయటం మానేస్తే, ఇవే సౌఖ్యాలతో ఎన్ని రోజులు బ్రతగ్గలవు – అన్నది నీకున్న ప్రస్తుత సంపద . ★★★★★

→•←

సమయాన్ని తన చేతిలో వుంచుకోగలగటం, తన కిష్టమైన పని మాత్రమే చేసే స్థితిని సంపాదించటం, ఈ ప్రపంచంలో మనిషికి ఆర్థికపరమైన నిజమైన సంపద. ★★★★★

→•←

ఏ పనీ చేయకుండా వున్నాకూడా, నీ జీవితం మునుపటిలాగే సాగిపోయే రోజు నీ జీవితంలో ఎంత తొందరగా వస్తే, అంత తొందరగా 'నీ' కాలం నీ చేతిలో వుంటుందన్న మాట. నీవు నీకు అధికారివి అయ్యావన్నమాట. ★★★

→•←

ఏడాదికొకసారి అలక్‌నందా నదుల్ని, ఆల్ప్స పర్వతాల్నీ చూడటానికి వెళతాం. కిటికీ తెరుస్తే కనపడే సూర్యాస్తమయాన్ని చూడం. ★★★★

→•←

దేనికోసం ఏది వదిలెయ్యాలో తెలుసుకోవటమే జ్ఞానం. ★★★★★

→•←

ఒకవైపు అనుభవించాలి. మరో వైపు భవిష్యత్తు గురించి పొదుపు చేస్తూ జాగ్రత్త పడాలి!! సంపాదన ఖర్చుల మధ్య సరిగ్గా సమన్వయ పర్చగలవాడు ఆధునిక యుగంలో ఆర్థిక జ్ఞాని !! ★★

→•←

యవ్వనంలో లక్ష ఆదా చేస్తే, ప్రతి నెలా వెయ్యి రాబడి. యవ్వనంలో లక్ష అప్పు చేస్తే, ఆ పై జీవితాంతం నెలకి వెయ్యి ఖర్చు. ★★

→•←

తన శక్తికి మించిన కోరికలు పెట్టుకోకపోవటం (కామరాహిత్యం), తీరని కోరికల వల్ల వచ్చే అసంతృప్తిని జయించటం (క్రోధరాహిత్యం), జీవితాన్ని తృప్తిగా అనుభవించగలగటం (లోభరాహిత్యం) కన్నా కావల్సింది ఏముంది? ★★★

→•←

భవిష్యత్‌లో రాబోయే రాబడి మీద ఎప్పుడూ 'అప్పు' చెయ్యొద్దు. ★★

→•←

లోభము వేరు. పొదుపు వేరు. తాను తినకుండా, ఇతరులకి పెట్టకుండా దాచుకునే దానిని లోభము అంటారు. తన భవిష్యత్తు కోసం వీలైనంతలో కొంత దాచుకోవటాన్ని పొదుపు అంటారు. ★★

→•←

విశ్రాంతి అంటే – తన కిష్టమైన పని చేయటం. ★★★

→•←

అచ్చంగా నీలాగే మరొకరు ఈ ప్రపంచంలో వుంటే వారిని నువ్వు ఇష్టపడతావా? పడవా? అదే ఆత్మ విమర్శ! ★★★

→•←

గడిచిన కష్టాల్ని తల్చుకుంటూ తీరిగ్గా బాధ పడటాన్ని Neuropathic Pain అంటారు. ★★

→•←

మన విద్యావిధానం బకెట్‌లు మోసే వారినే తయారు చేస్తుంది తప్ప. పైప్‌లైన్ నిర్మించే వారిని తయారు చేయదు. ఎగ్జిక్యూటివ్‌లని తయారు చేసే కోర్సులు వున్నాయి గాని, యజమానుల్ని తయారు చేసే కోర్సులు మన విద్యా విధానంలో లేవు. ★★★

→•←

అవసరాలకి ఎంత ఖర్చు పెట్టాలి? ఆనందానికి ఎంత ఖర్చుపెట్టాలి? ఎంత మిగల్చాలి? ఈ మూడూ ఆర్థిక నిబద్ధత.

రాబడి కోసం ఎంత సమయం ఖర్చు చెయ్యాలి? కొత్త వనరుల కోసం (తనలోని శక్తిని, కొత్త కళని పెంపొందించుకోవటం కోసం) ఎంత టైమ్ వినియోగించాలి? ఎంత సమయం కుటుంబంతో కలిసి విశ్రాంతి తీసుకోవాలి? ఈ మూడూ సమయ నిబద్ధత. ★★★

→•←

"ఎక్కువ చూడకు – గుడ్డివాడివి కావొచ్చు.

ఎక్కువ చదవకు – పిచ్చివాడివి కావొచ్చు.

ఎక్కువ నడవకు – పడిపోవచ్చు.

ఎక్కువ పనిచెయ్యకు – అలసట రావొచ్చు" ఇలా అనుకొనే నిరాశావాది ఇది కూడా అనుకుంటాడు.

"ఎక్కువ బ్రతకకు – చావు రావొచ్చు." ★★★

→•←

అనార్యోగం రెండు రకాలు. శారీరకము. మానసికము. మొదటిది చావుకి దగ్గిర చేస్తుంది.

రెండోది ఆనందానికి దూరం చేస్తుంది. ★★

→•←

అంతిమ పరిణామం ఎప్పుడూ మనం ఊహించినంత నష్టభరితంగా ఉండదు. ★★

→•←

జ్ఞానం పెరిగే కొద్దీ 'బంధం' తగ్గిపోతుంది. ఆ విధంగా దుఃఖం కూడా తగ్గిపోతుంది. ★★★★★

→•←

నీ మీద నీడ పడుతోంది అంటే ఎక్కడో వెలుగు వున్నదనేగా అర్థం. ★★★★★

→•←

ప్రమిదలో వెలిగే దీపం సౌందర్యం.

పెదవి అంచున ప్రార్థనా గీతం సౌందర్యం.

చెవులు వినే గీతమూ కనులు చూసే రూపమూ కాదు సౌందర్యం.

కనులు మూసుకున్నా రూపాన్ని చూడగల,

చెవులు మూసుకున్నా రాగాన్ని వినగల 'హృదయమే ' సౌందర్యం.

బిచ్చగత్తె వణికే శరీరం పై నువ్వు కప్పిన శాలువా సౌందర్యం. ★★★

→•←

కోపం రావటం ప్రతి మనిషికీ సహజమే. అయితే, సరి అయిన సమయంలో, సరి అయిన మనిషి మీద, సరి అయిన కారణం కోసం, సరి అయిన మోతాదులో, సరి అయిన రీతిలో ప్రదర్శించగలగటం మాత్రం అంత సులభం కాదు. ★★

→•←

నిరాశావాది, గులాబికి క్రింద ముల్లు వున్నందుకు విచారిస్తాడు. పైన లేనందుకు ఆశావాది ఆనందిస్తాడు. ★★★★★

→•←

పెద్ద విషయాలని 'చేయలేము' అనీ, చిన్న విషయాలని 'ఏం చేస్తాంలే' అనీ అనుకునేవాడు చివరకు ఏమీ చేయడు. ఏదో ప్రమాదం వస్తుందని, అసలు పనే ప్రారంభించని వాడు అధముడైతే, ఒక సమస్య రాగానే చేస్తున్న పనిని వదిలి

పెట్టేవాడు మధ్యముడు. మానవ సరోవరానికి షార్ట్‌కట్ లేదని గ్రహించినవాడు గొప్పవాడు. ★★★★

→•←

ప్రేమించటంలో ఆనందం పొందటం సుఖానికి హేతువు. ప్రేమని ఆశించటంలో ఆనందం పొందటం దుఃఖానికి హేతువు. అదే విధంగా, అనుకున్నది జరగకపోవటం క్రోధానికి హేతువు. అనుకోనిది జరుగుతుందేమో అన్నది 'భయా' నికి హేతువు. ★★★

→•←

నీకొక సమస్య వచ్చిందంటే ఒక యుద్ధం చేసే అవకాశం వచ్చిందన్నమాట. నీకోసం అప్రయత్నంగా ఒక తలుపు తెరుచుకున్నది. గెలిస్తే అది ఒక విజయం. ఓడితే అది ఒక అనుభవం. రెండూ మంచివే కదా! ★★★

→•←

"యుద్ధం వల్ల శత్రువుకి వీర మరణం పొందే అవకాశాన్ని నువ్వు కలుగచేస్తున్నావు. ఇది మొదటి లాభం. లేదా ఒకవేళ నువ్వు మరణించావా, స్వర్గసుఖం పొందుతావు. ఇది రెండో లాభం. లేదా గెలిచావా, రాజభోగమనే స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తావు. అన్ని విధాలా యుద్ధం లాభమే కదా" అంటున్నాడు కృష్ణుడు. అందుకే కృష్ణుడికి మించిన మోటివేటర్ చరిత్రలో ఇంకెవరూ లేరన్నది. ★★★★

→•←

అంతర్గత భయాలు ఎక్కువ వున్నవారు "నా" అంటూ తమ గురించి ఎక్కువ మాట్లాడతారు. ★★

→•←

నిన్ను నువ్వు విపులీకరించుకునే కొద్దీ అవతలి వారికి నువ్వొక గాలి బుడగలా కనిపిస్తావు. ★★★

→•←

వీలైనంత వరకు సంభాషణల్లో, నీవు ఎవరితో మాట్లాడుతున్నావో ఆ వ్యక్తి పేరు తరచూ దొర్లేటట్లు చూడు. మొత్తం సంభాషణలో కనీసం సగభాగమైనా అవతలి వ్యక్తి మొహంలోకి చూస్తూ మాట్లాడు. ★★

→•←

వాదించకు. వాదనలో గెలుస్తావేమో కానీ, అవతలి వ్యక్తి అభిప్రాయాన్ని మార్చలేవు. నువ్వెక్కువగా వాదించే కొద్దీ, అవతలి వ్యక్తి ఓడిపోతున్నాడన్న మాట. కానీ వాడి దృష్టిలో నువ్వు గెలవటం లేదు. ★★★

→•←

ఒక వ్యక్తి స్టేజి మీద మాట్లాడుతున్నాడు. పొరపాటున జిప్ పెట్టుకోవటం మర్చిపోయాడు. పది మందిలో లేచి ఆ విషయం చెబితే అది నిర్హేతుక విమర్శ. చిన్న కాగితం మీద ఆ విషయాన్ని రాసి అతనికి పంపితే, అది అతని పొరపాటుని ఎత్తి చూపటం. అదీ తేడా! ★★

→•←

తప్పు నీదే కావచ్చు. నిర్భయంగా దాన్ని ఒప్పుకో. నీ తప్పు ఒప్పుకోవడం వలన అవతలివారు రెండు మెట్లు దిగివస్తారు – నీతో కరచాలనం చెయ్యడం కోసం! ★★

→•←

ఎవరైనా నిన్నొక సాయం అడిగితే, నీకు వీలైతే తప్పకుండా చెయ్యి. "ఇంకా ఏమైనా సాయం కావాలా" అనడుగు. ఆ ఒక్కమాట నిన్ను ఉన్నత శిఖరాల మీద నిలబెడుతుంది. ★★

→•←

నిద్రపోయి కలలు కనటం కన్నా – 'కలకన్నా వాస్తవం బావుంద'న్న ఫీలింగే రాత్రంతా నీకు నిద్రని దూరం చేస్తే, ఆలసట లేకుండా నువ్వు పని చేస్తూ వుంటే, నిశ్చయంగా నీవు గెలుపు వైపు సాగుతున్నట్టే. ★★★★

→•←

చేసిన ప్రతి సాయాన్నీ మర్చిపో... బదులుకోరక! వచ్చిన ప్రతి పొగడ్తనీ మర్చిపో.... దాన్ని గెలుచుకున్నాక! చేసిన ప్రతి వాగ్దానాన్నీ మర్చిపో.... నెరవేర్చాక! తీసుకున్న అప్పు గురించి మర్చిపో.... తీర్చాక ! ★★★★

→•←

ఎక్కడ ప్రేమ వున్నదో అక్కడ కీర్తి వుంటుంది. ★★

→•←

ఏ ఇంట్లో పెద్దల 'కీర్తి' తగ్గిపోయిందో ఆ ఇంట్లో ప్రేమలు తగ్గిపోతాయి. ★★

→•←

ఆటవిక కాలంలో కుర్రవాళ్ళకి తమ వృత్తిపట్ల బద్ధకం లేదు. పదో ఏట నుంచీ హుషారుగా వృత్తి (వేట)కి వెళ్ళేవారు. ఇప్పుడు కుర్రవాళ్ళకి వృత్తి (చదువు) అంటే బద్ధకం! ★★

→•←

తన వైఫల్యాల్ని కూడా స్త్రీ మీద నెట్టెయ్యటానికి పురుషుడు సిద్ధంగా వుంటాడు. తన విజయాన్ని మొత్తం కుటుంబ విజయంగా అభివర్ణించటానికి స్త్రీ సిద్ధంగా వుంటుంది. ★

→•←

జరిగిన ప్రతి విషయమూ భర్తకి చెప్పటం 'ప్రేమ' అనుకుంటుంది స్త్రీ. విషయం చెప్పటం పూర్తికాకుండానే దానికి పరిష్కారం చెప్పటం 'తెలివి' అనుకుంటాడు పురుషుడు. ★

→•←

స్త్రీ కోసం గ్రీటింగ్ కార్డ్ కొనే పురుషుడు, తాను ఎక్కువ వ్రాయనవసరం లేకుండా, నిండుగా వ్రాయబడి వున్న కార్డు కొంటాడు. పురుషుడి కోసం స్త్రీ చిన్న వాక్యం వున్న కార్డు కొంటుంది. తను దాన్ని పూర్తిగా నింపటానికి వీలుగా. ★★

→•←

ఈ ప్రపంచంలో మంచివాడిగా బ్రతకటం కోసం అందరితో స్నేహంగా మాట్లాడాలి. కానీ, ఆనందంగా బతకటం కోసం మనతో మనం నిజాయితీగా మాట్లాడుకోవాలి. ★★★

→•←

'ఆత్మవిమర్శ' మనలో మనం చూసుకునేది. 'వ్యక్తిత్వం' మనలో బయటవారు చూసేది. 'గౌరవం' అవతలి వారు మనకిచ్చేది. వీటన్నిటికీ పునాది 'గుణం', మనలో వున్నది. ★★

→•←

'సుఖం' పెరిగినంతగా మనుషుల్లో సంతోషం పెరగటం లేదు. ★★

→•←

కోరికలున్న మనిషి సంతృప్తిగా వుంటాడా? కోరికలు లేని మనిషి సంతృప్తిగా వుంటాడా? నిశ్చయంగా కోరికలు లేని మనిషే. కానీ కోరికలు లేకపోవటం వేరు, కోరికలు తీర్చుకో లేకపోవటం వేరు. ★★

→•←

తనలో వున్న ఏదో ఒక గొప్ప గుణం మీద ప్రతి మనిషికీ నమ్మకం వుండాలి. విజయానికి అది ప్రారంభం. ★★

→•←

ఈ బాధావలయ ప్రపంచంలో, నీవిచ్చే సంతోషం ఒక గిఫ్ట్!

ఈ బీద ప్రపంచంలో, నీ చిరునవ్వు సంపద ఒక గిఫ్ట్!

ఈ ద్వేషపూరిత ప్రపంచంలో, నీ ప్రేమ ఒక గిఫ్ట్!

ఈ నిరాశా లోకంలో, నీ నమ్మకమే ఒక గిఫ్ట్!

భయపడేవారికి, నీ స్పర్శ ఒక గిఫ్ట్!

పై గిఫ్ట్‌లన్నీ ఖరీదు లేనివని తెలుసుకోవటమే

భగవంతుడు నీకిచ్చిన పెద్ద గిఫ్ట్. ★★★

→•←

కీర్తి అంటే మొదట మనల్ని మనం గుర్తించగలగటం. ఆ తరువాత ఇతరులచే గుర్తింపబడటం. ★★

→•←

మనిషి 'టీ బ్యాగ్' లాటి వాడు. అతడెంత స్ట్రాంగో తెలుసుకోవాలంటే కష్టం అనే వేడివేడి నీళ్ళల్లో ముంచాలి. ★★★★★

→•←

జ్ఞానులు అవసరం వచ్చినప్పుడు మాట్లాడతారు. అజ్ఞానులు అవసరం కల్పించుకుని మాట్లాడతారు. ★★★★

→•←

భగవంతుడు ఈ ప్రపంచాన్ని సృష్టిస్తున్నప్పుడు అదొక రసరమ్య కావ్యం...! కొండల్నీ గుట్టల్నీ సృష్టిస్తున్నప్పుడు అది ఒక అపురూప శిల్పం...! చెట్లనీ, లతల్నీ సృష్టిస్తున్నప్పుడు అదొక హరితవర్ణ చిత్రం...! ఛెంగున గెంతే లేళ్ళనీ, జంతువుల్నీ సృష్టిస్తున్నప్పుడు అదొక అందమైన అల్లరి మైదానం.....! మనుషుల్ని సృష్టిస్తున్నప్పుడు అదొక నాటక రంగస్థలం....! మనం హీరోలమవ్వాలా, ధీరోదాత్తుల మవ్వాలా, విలన్లమవ్వాలా, ఎప్పుడూ దుఃఖించే పాత్రలమవ్వాలా మనమే నిర్ణయించుకోవాలి. ★★★

→•←

ఇద్దరు మాట్లాడేటప్పుడు నువ్వు మౌనంగా వుండు. నీ శక్తి వృధా చేసుకోకు.★★★

→•←

ఇతరులకి ఉపయోగపడని విషయాలు నువ్వు మాట్లాడటం, నీకు ఉపయోగపడని విషయాలు వినటం.... నీ కాలాన్ని వృధా చేస్తాయి. ఇవి ఎంతో మత్తైన ఆనందాన్ని ఇస్తూ నిన్ను 'సామాన్యుణ్ణి' చేస్తాయి. ★★★

→•←

మనిషి దినచర్య మూడు ముఖ్య భాగాలుగా సాగాలి. 1.పని, 2. ఉల్లాసం, 3. విశ్రాంతి. ఈ మూడింటినీ సరిగ్గా నిర్ధారించుకోగలిగే వ్యక్తికి విషాదం వుండదు. ★★★

→•←

ఏ వ్యక్తి అయితే 'పని'ని ఒక ఏడుపుగొట్టు బాధ్యతగానూ, ఉల్లాసాన్ని వ్యసనంగానూ, విశ్రాంతిని బహుమతిగానూ భావిసాడో, ఆ వ్యక్తికి పురోభివృద్ధి లేదు. ★★★★

→•←

పని అంటే తనతో తాను రమించటం. "నీ గమ్యము (ఫలము) లభిస్తుందన్న ఆశ (ఫలాభిలాష)తో పని (కర్మము) చేయకుము. పని చేయటమే లాభము (నీ కర్తవ్యము)" అన్నాడు శ్రీ కృష్ణుడు. ★★★

→•←

మనం మార్చలేని విషయాలని ఒప్పుకుని తీరాలి. మార్చగలిగే విషయాలను మార్చగలిగే ధైర్యం సంపాదించుకోవాలి. ఈ రెండిటి మధ్య తేడా తెలుసుకోవటమే స్థిత ప్రజ్ఞత. ★★★

→•←

నీ తోటని నువ్వే పెంచు. చేతిని చేతితో పట్టుకోవటానికీ, హృదయాన్ని హృదయంతో లంకె వేయటానికీ తేడా వుందని తెలిసాక, మిత్రమా....... ప్రేమకు చిహ్నాలు ముద్దులు కావనీ, వాగ్దానాలు బహుమతులు కావనీ అర్థమవుతుంది.

మందు నీవు నీ తోటని శుభ్రం చేసుకో. హృదయ క్షేత్రంలో ప్రేమ విత్తనాలు జల్లు, ఎవరో తెచ్చే పూలని ఆశించకు. అప్పుడు నీవు తలెత్తి ధైర్యంగా నీ తప్పుల్ని వప్పుకోగలవు. పూవుల్ని ఇతరులకి ఇవ్వగలవు. ★★

→•←

జ్ఞానం అంటే ఏమిటి? ఈ రోజు హాయిగా బ్రతుకుతూ..... రేపు ఇంతకన్నా బాగా బ్రతకటం ఎలాగో తెలుసుకోవటం. ★★★★★

→•←

నువ్వు చేసే ఏ పని అయినా చివరికి సుఖాంతమై, ముగింపులో నీకు లాభాన్నీ, సంతోషాన్నీ, తృప్తినీ ఇస్తుంది. అలా ఇవ్వలేదంటే.... ఆ పని ఇంకా ముగియలేదన్న మాట. ★★★

→•←

నీవు ఆగితే, నీతో ఆగదు నీ నీడ, నీవు సోలితే ఏదీ రాదు నీతో కూడా. ★★

→•←

మన తల్లిదండ్రులూ, టీచర్లూ అందరూ వారిని 'వినటం' ఎలాగో మనకి నేర్పుతారు. మనల్ని మనం వినటం ఎలాగో నేర్పరు. ★★

→•←

గెలుపు 'రూమ్ స్ప్రే' లాంటిది. ఆ గదిలో కూర్చుంటే మనసు ఫ్రెష్‌గా వుంటుంది. ఒకసారి ఆ పరిమాళానికి అలవాటు పడితే, అక్కడే వుంటూ దానిని మరింత పెంచాలనిపిస్తుంది. ★★

→•←

నరకంలో ఎన్నో బాధలు అనుభవిస్తూన్న నన్ను భగవంతుడు పిలిచి, తన కమండలం నాకిచ్చి, "ఇంతకన్నా హాయిగా, శాంతిగా క్రింద భూమ్మీద బ్రతికే విద్య నీకు నేర్పుతాను. వెళ్ళి ఆ పని చేస్తావా?" అని అడిగాడు.

చేస్తానన్నాను. "కానీ ఎలా మొదలు పెట్టాలి? ఎక్కణ్ణుంచి ప్రారంభించాలి? నా బ్రతుకు తెరువు కోసం ఏం చెయ్యాలి? రోజుకి ఎన్ని గంటలు పని చేయాలి? ఎంతకాలం చెయ్యవలసి వుంటుంది?" అని ప్రశ్నించాను.

భగవంతుడు చిరునవ్వుతో నా నుంచి తన కమండలాన్ని వెనక్కు తీసుకున్నాడు. ★★★

→•←

కురుక్షేత్రం పాండవులకీ, కౌరవులకూ మధ్య జరిగిన యుద్ధం. భగవద్గీత మనిషికీ, అతడి బలహీనతలకీ మధ్య జరిగిన యుద్ధం. ★★

→•←

నువ్వు జీవితంలో అందరికన్నా అమితంగా ఒకర్ని ప్రేమించు. ముందు ప్రేమగా చెప్పు. వాదించు. వినకపోతే చీల్చి చెండాడు. నీక్కావల్సినట్టు మార్చుకో. తరువాత నిండారా కౌగలించుకుని నీలో ఐక్యం చేసుకో. పరిపూర్ణమైన మనశ్శాంతికి ఇదే మార్గం. ఇంతకీ ఎవరా వ్యక్తి? ఆ వ్యక్తివి నువ్వే. ★★★

→•←

తప్పు చేద్దాం రండి .....!

అందరూ మూర్ఖులుగా మారి ఒక్కడు మారకపోతే ఒక సమస్య. ఒక్కడు తొందరగా మారి అందరూ మారకపోతే ఇంకా పెద్ద సమస్య. ★★

→•←

వర్షం మేకలకి శత్రువు. గొర్రెలకి మిత్రువు. వర్షం వచ్చినప్పుడు గొర్రెలు మైదానం మధ్యలో ఆనందంగా తడుస్తాయి. మేకలు శత్రువు వెంటపడినట్టు చెట్టు క్రిందికి పరుగెడ్తాయి. అదే విధంగా ఎండ మేకలకి మిత్రువు. గొర్రెలకి శత్రువు. బాగా ఎండ కాస్తుంటే గొర్రెలు చెట్లక్రిందికి పరుగెడ్తాయి. మేకలు ఆహారం వెతుక్కుంటాయి. అదంతా వాటి వాటి స్వభావం. మనుష్యుల్లా ఒకరి అభిప్రాయాన్ని మరొకటి తప్పుపట్టావు. ★★★

→•←

"....ప్రతి మనిషి విజయమూ అతని నీతి, నిజాయితీల మీద ఆధారపడి వుంటుంది..... అంటే.... అవి ఎంతవరకూ కావాలని కాదు. చట్టానికి లోబడి, వాటిని ఎంతవరకూ వదిలిపెట్టవచ్చో తెలుసుకోవటం మీద......." ★★★★

→•←

గెలుపు అంటే శిఖరం చేరుకోవటం కాదు. చేరుకున్న తరువాత ఏం చెయ్యాలా అని ఆలోచించటం. ★★★

→•←

ఇతరుల నుంచి నువ్వేదయినా సాయంగానీ, పని గానీ ఆశిస్తున్నప్పుడు, నువ్వు గతంలో వారికి చేసిన సాయంగురించి గానీ, నీకు వారితో వున్న స్నేహం గురించి కానీ ప్రస్తావించకు. నీ స్నేహం వల్ల వారికి వస్తున్న లాభం ఏమిటా అని వారు

వెంటనే ఆలోచించుకుంటారు. నీ పని ఎలా ఎగ్గొట్టాలా అని ఆలోచిస్తారు. అలా కాకుండా, నీకీ సాయం చేయటం వల్ల, నీతో స్నేహం వల్ల, వారికి కలిగే లాభం ఏమిటో ఇన్-డైరెక్ట్‌గా చెప్పు. వారాపని చేస్తారు. ★★★

→•←

ఒక దీక్ష మూడ్ లోంచి మరొక విశ్రాంతి మూడ్ లోకి మార్పు...అదే విజయం. ★

→•←

నీకు తెలివి రావాలంటే ప్రతి రోజూ కొంత అవసరమైనది నేర్చుకో. నీకు జ్ఞానం రావాలంటే ప్రతి రోజూ కొంత అనవసరమైనది వదులుకోవటానికి సిద్ధపడు.

★★★

→•←

పోరాటానికి వెళ్తున్నప్పుడు నీతోపాటూ విజయోపన్యాసాన్ని తీసుకెళ్ళటం నీపై నీకున్న నమ్మకం. ★★★★

→•←

మార్పు నీ మీద ప్రభావం చూపేలోపులో, నువ్వు మార్పుని ప్రభావితం చెయ్యి.

★★★

→•←

ఒకసారి విజయాన్ని రుచిచూడటం ప్రారంభించిన తరువాత, విజయాన్ని రుచి చూడటం అలవాటు(Habit)గా మారుతుంది. ఆ తరువాత అది అభిరుచి (Hobby) అవుతుంది. చివరికి గెలుసాక వ్యసనం (Vice) గా ఎదుగుతుంది. అప్పుడిక అంతా ఆనందమే. ★★★

→•←

ఈ ప్రపంచంలో అన్నిటికన్నా పెద్ద ట్రాజెడీ బాల్యంలో చచ్చిపోవటం కాదు. 75 సంవత్సరాలు బ్రతికీ ఏమీ సాధించ లేకపోవటం. ★★★★

→•←

గతం గొప్పదే. కానీ గతం కన్నా ఈ రోజు గొప్పగా లేకపోతే ఆ వ్యక్తి జీవన విధానంలో ఏదో తప్పు వుందన్నమాట. ★★★

→•←

ఒక మనిషి గెవటానికి వంద సూత్రాలు కావాలి. అందులో అన్నిటికన్నా మొదటిది తనని తాను కరెక్టుగా తెలుసుకోవటం. మిగతా 99 అంతగా ప్రాముఖ్యత లేనివే. ★★

→•←

మార్పు – ముందు హేళన చేయబడుతుంది. తరువాత ప్రశ్నింపబడుతుంది. ఆ పైన విమర్శింపబడుతుంది. వేగంగా తిరస్కరింప బడుతుంది. చివరగా – ఒప్పుకోబడుతుంది. ★★★

→•←

ఈ ప్రపంచంలో అందర్నీ సంతోష పెట్టాలనుకునేవాడు తాను సుఖంగా వుండలేడు. తన వారిని సుఖపెట్టలేడు. ★★★★★

→•←

'అంతా తనదే' అన్నది మమకారము. 'అంతా తనే' అన్నది అహంకారము. రెండూ వదలవలసినవే ! ★★★★

→•←

పుస్తకమంటే – ఘనీభవించిన జ్ఞానము. It's a frozen thought.... ★★

→•←

పొరపాటుకి క్షమాపణ చెప్పుకోవటం పాత పద్ధతి. పొరపాటున కరెక్టుగా సరిదిద్దుకోగలగటం కొత్త పద్ధతి. ★★

→•←

....నీకున్న తెలివీ, నీ నైపుణ్యం, జ్ఞానం నీకు ఉపయోగపడటం లేదంటే అవి వాటి తప్పుకాదు. నీ చుట్టూ వున్న పరిస్థితుల తప్పు. నీ చుట్టూ వున్న ఆ పరిస్థితుల్ని మార్చుకుని, అవకాశాలని సృష్టించుకోలేకపోతే అవన్నీ వృథా అవుతాయి. ★★

→•←

నీవు మనసులో బెదిరిపోతున్నట్టు బయటకు కనపడనివ్వకు. నీ భయాన్ని ఆసరాగా తీసుకుని అవతలివాడు నిన్ను డామినేట్ చేయటానికి ప్రయత్నిస్తాడు. పైగా దానికి 'స్నేహం' అని పేరు పెడతాడు. నిన్ను తన మీద ఆధారపడేలా చేసుకుని, తన మంచితనం పేరిట నీకు రకరకాల బోధనలు చేసి, నిన్ను తన ఆధీనంలో వుంచుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. ★★★★

→•←

నీ వెనుక ఎవడన్నా గొయ్యి తవ్వుతున్నాడని తెలిస్తే వాడిని దూరంచేసుకోకు. గొయ్యి తవ్వటంలో వాడి సమయాన్ని వృథా చేసుకోనివ్వు. నీకేమీ ప్రమాదం లేదు. గొయ్యి ఎక్కడ వున్నదో నీకు తెలిసిన తరువాత ఇక ప్రమాదం ఏమున్నది? వాడిని దూరం చేసుకుంటే, నీకు తెలియవి మరో చోట గొయ్యి తవ్వుతాడు. ★★★

→•←

నీకెన్ని తెలివితేటలున్నా, నీ పై అధికారికి నచ్చకపోతే అవి వృథా. నీలో ఎన్ని మంచి గుణాలున్నా నీ భర్తగానీ, భార్యగానీ, కుటుంబసభ్యులు గానీ వాటిని గుర్తించకపోతే వృథా. ★★★★

→•←

నీ ట్యూన్‌కి నువ్వు సరీగ్గా నాట్యం చేయటం నేర్చుకో. తార్కికం (Logic) గా ఆలోచించు. అరచేతిలో చెమటలు పట్టటం వల్ల పరీక్షలు ప్యాసవుతావా? సినిమా హాల్లో విచారించటం వలన వంటింట్లో స్టౌ దానంతట అదే ఆరిపోతుందా? ఆలోచించు. ★★

→•←

ముందునించి పొడిస్తే, 'యుద్ధం'. వెనుకనుంచి పొడిస్తే 'వంచన' ఈ రెండూ కాకుండా వాడంతట వాడే నీకు లొంగిపోయేలా చేసుకోవటం 'తెలివి'. ★★

→•←

తెలివైన ప్రతివాడూ నిజాయితీగా, నీతిగా, మర్యదగా, మనం ఏర్పర్చుకున్న విలువల పరిధిలో, మనల్ని వంచిస్తూ వుంటాడు. Deception (మోసం) అన్నపదం Decency (మర్యాద) అన్న పదంలోంచి వచ్చిందన్న అనుమానం మనకి కలుగకుండా, తన పని తాను చేసుకుపోతూ వుంటాడు. ★★★

→•←

నీ గురించి ఆలోచించు. నువ్వేమిటి? సామాన్యుడైన మంచివాడివా? సామాన్యుడైన చెడ్డవాడివా? మర్యాదస్థుడివా? మోహమాటస్థుడివా? కఠినుడివా? అందరితో మంచిగా వుండాలనుకుంటున్న వాడివా? ఒక్క విషయం గుర్తించుకో. అందరితోనూ అన్ని వేళలా మంచిగా వుండాలనుకునే చాలా మంది ప్రజల్ని, కొంతమంది మోసగాళ్ళు ఎప్పుడూ ఉపయోగించుకుంటూ వుంటారు. ★★

→•←

గెలుపంటే మంచి పేక ముక్కలు పడటం కాదు. పడిన ముక్కల్తో సరీగ్గా ఆడగల్గటం! ఆడటం నీ చేతిలో వుంది. ముక్కలిచ్చిన భగవంతుడి చేతిలో కాదు!! ఆడించేది కూడా భగవంతుడే అని నమ్మినవాడిని భగవంతుడు కూడా బాగుచెయ్యలేడు!!! ★★★★★

→•←

ఇప్పుడు బాగానే వున్నాం కదా అనుకునేవాడు వాచర్. ఇంతకన్నా బాగా వుండటం ఎలా అని ఆలోచించేవాడు పెర్ఫార్మర్. ఒకడు చూస్తాడు. ఇంకొకడు చేస్తాడు.

★★★

→•←

మైక్ టైసన్‌ని గెలవాలని వుంది. కానీ నీకు కుడి చెయ్యలేదు. ఎలా గెలుస్తావ్? 'గజబంధం' నేర్చుకో. అందులో నీ శత్రువు నిన్ను క్రింద పడెయ్యాలంటే, నీ కుడి చెయ్యి పట్టుకుని తిప్పాలి. పోటీ జరుగుతున్నంత సేపూ టైసన్ నీ కుడిచేతి గురించి వెతుకుతూనే వుంటాడు. నువ్వు గెలుస్తావు. ఆ మాత్రం నమ్మకం నీ మీద నీకుంటే దేవుడు పెట్టిన కష్టాలని కూడా గెలవగలవు. ★★

→•←

ఏదైనా విషయాన్ని విశ్లేషించవలసి వచ్చినప్పుడు, దాని తాలూకు పరిణామాలన్నీ ముందు పరిశీలించాలి. వాటిలో 'తనకి ఇష్టమైనదాన్ని' కాకుండా తనకి 'ఉపయోగపడే దాన్ని' ఎన్నుకోవాలి. ★★★★

→•←

చిత్రమేమిటంటే, ప్రతివారూ అవతలి వారు మారాలని కోరుకుంటారే తప్ప, అది అసాధ్యమని గుర్తించరు. ఒక సమస్య వచ్చినప్పుడు నీకిష్టమయిన, నీకు సులభమైన పరిష్కారం కావాలంటే ఎలా? నువ్వు మారటం కష్టమయినప్పుడు, అవతలి వారు

ఎందుకు మారతారు?! కష్టం నీది! నువ్వు మారాలి! అవతలి వారు సుఖంగా వున్నారు! కనీసం అలా అనుకుంటున్నారు! అప్పుడు వారు ఎందుకు మారతారు? ★★★★★

→•←

'తప్పు చేద్దాం రమ్మ'నగానే, ఏదో చీకటి తప్పు గురించి ఆలోచించటం అన్నిటికన్నా పెద్ద తప్పు. ★★

→•←

గెలుపంటే, ఇతరుల కన్నా నువ్వు గొప్పవాడివి అవటం కాదు. నిన్నటి 'నువ్వు' కన్నా ఈ రోజు 'నువ్వు' బావుండటం! ★★★

→•←

నా భవిష్యత్తు కోసం నేనేమయినా చేస్తాను. ఎందుకంటే నేను తరువాతి క్షణం అక్కడే గడపాలి కాబట్టి. ★★

→•←

....నేడు రేపటికి 'నిన్న' అవుతుంది. నిన్నటి గురించి రేపు బాధ పడకుండా వుండాలంటే, నేడు కూడా బావుండాలి. ★★

→•←

చివరి క్షణం వరకూ బ్రతకటం ఎలాగో నేర్చుకుంటూ వుండటమే జీవితం. మూర్ఖుడు తన భవిష్యత్తుని తన ముందున్న మూడడుగుల కంటే ఎక్కువ చూడలేడు. మూడడుగులు నడవటం నేర్చుకుంటే చాలనుకుంటాడు. పిల్లల పెళ్ళి చేసి రిటైరవ్వటం కోసం కాదు మనం బ్రతుకుతున్నది. ★★

→•←

నీ అభిరుచులకి అనుగుణంగా గమ్యం ఏర్పరచుకోకు. నీ గమ్యానికి అనుగుణంగా అభిరుచులు ఏర్పరచుకో. ★★★★★

⇥•⇤

కోపంలో వున్నప్పుడు శరీరంలో విడుదలయ్యే అడ్రినలిన్, మనిషి కిడ్నీలని పాడు చేస్తుంది. నిన్ను తిట్టేవాడి కడుపుని సూటిగా చూడు. అతడిని నగ్నంగా వూహించుకో. అతడి లోపల విడుదలవుతున్న అడ్రినలిన్‌నీ, అది కిడ్నీలవైపు వెళుతున్న విధానాలన్నీ గమనిస్తూ మనసులో, "పోతావురా! కిడ్నీలు పాడయి తొందర్లోనే పోతావు" అనుకుంటూ వుండు. నీకు నవ్వొస్తూ వుంటుంది. వాడు నిన్ను తిడుతూనే వుంటాడు. ★★

⇥•⇤

Try to DATE with yourself at least one hour every day. ★★

⇥•⇤

"ఈ ప్రపంచంలో నూటికి తొంభైమంది, అతవలి వారు ఏం చెప్తే అది వినటానికి సిద్ధంగా వుంటారు" అని స్పష్టంగా నమ్మిన వాడే నాయకుడు కాగలడు. ★★★

⇥•⇤

'నేను పాపం చేసాను. రక్షించు' అనేవాడు సామాన్యుడు. 'నేను పాపం చెయ్యను' అనేవాడు బుద్ధిమంతుడు. 'నేను చేస్తున్నది పాపమో కాదో నాకు తెలీదు' అనేవాడు తెలివైనవాడు. ★★★

⇥•⇤

ఒక స్త్రీ అందంగా వుంది కాబట్టి ప్రేమించొద్దు. నువ్వు ప్రేమించావు కాబట్టి ఆమె అందంగా వుండాలి. ★★★★★

⇥•⇤

వెళ్తున్నప్పుడు విత్తనాలు జల్లుకుంటూ వెళ్తే, వచ్చేటప్పటికి చెట్లు స్వాగమితస్తాయి. ★★★★

→•←

అవసరమైనప్పుడు మాట్లాడ(లే)కపోవటం భయస్థుడి లక్షణం. అనవసరమైనప్పుడు మాట్లాడటం మూర్ఖుడి లక్షణం.... ఎప్పుడెంత మాట్లాడాలో తెలుసుకోగలగటం గొప్పవాడి లక్షణం. ★★★★

→•←

ఉచితంగా ఏదీ తీసుకోకు. చివరికి అది ప్రేమ అయినా సరే..... దానికి మూల్యం చెల్లించు. స్పష్టమైన వస్తు రూపంలోనో, క్రియ రూపంలోనో, భాషలోనో ఆ ఋణం తీర్చేసుకో. ★★★

→•←

ప్రొద్దున్న ఎనిమిదింటివరకూ పక్కమీద పడుకుని 'జీవితం ఎంత బావుందీ'- అనుకునే వాడికి తెల్లవార్నే మార్నింగ్ వాక్‌లో వుండే ఆనందం గురించీ, ఆరోగ్యం గురించీ తెలిసే అవకాశం లేదు. ★★

→•←

గొప్పవాడెప్పుడూ ఒక నిర్ణయం తీసుకున్నాక అది క్షురకర్మయినా, పెదకర్మయినా ఆ పని అంకితభావంతో చేస్తాడు. ★★

→•←

కనీసం రోజుకొకసారయినా, 'ఎంత బావుంది నా జీవితం' అనుకుంటూ వుండు. ఆ భావం నీకు గొప్ప శక్తి నిస్తుంది. 'బావుండటం' అనేది నీ చేతుల్లో వున్నదని గ్రహించటమే జీవితం. ★★★

→•←

గొప్ప విజయం కోసం చిన్న విజయాన్ని త్యాగం చెయ్యటమే 'పవర్'. ★★★★★

→•←

జీవితం భగవంతుడు ట్యూన్ చేసిన అద్భుతమైన పాటలాంటిది. ఆ పాటకి రచన (Lyrics) మాత్రం నీదే. నువ్వు సుఖంగా లేవంటే తప్పు ట్యూన్‌ది కాదు. నీ రచనది. ★★★★

→•←

ఒక కరెక్టు వ్యక్తిని కలుసుకోబోయే ముందు, పదిమంది అనామకుల్ని విధి పరిచయం చేస్తుంది. మొదటి వ్యక్తి దగ్గిరే ఆగిపోయేవాడు అనామకుడుగానే మిగిలిపోతాడు. ★★

→•←

అవకాశం ఒకసారే తలుపు తట్టుతుంది అంటారు. అది తప్పు. తలుపు దగ్గిర అది నిశ్శబ్దంగా నిలబడి వుంటుంది. అసలది అక్కడున్న విషయం కూడా మనకి తెలీదు. ప్రతి క్షణమూ దానికోసం చూస్తూనే వుండాలి. ★★

→•←

జీవితం – తపస్సు చేయకుండా లభించే ఒక ఉద్యానవనం. సుఖంగా బ్రతకటం కోసం దాని చివరి గమ్యం వరకూ అందమైన బాట మనమే వేసుకోవాలి. ★★

→•←

మలుపు తిరగటానికి కరెక్ట్ ప్లేస్ .....Dead-End. 'అంతా అయిపోయింది. ఇంకేమీ లేదు' అనుకున్న చోట ఆగిపోకు. ప్రక్కకి తిరుగు. మరోదారి కనపడుతుంది. ★★★

→•←

ఓడిపోయి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, ఆ ఓటమి నేర్పిన పాఠాన్ని చదువుకో – గెలుస్తావు. ★★★★

→•←

నీకు తెలివి వుంటే అది ఎప్పటికయినా గుర్తింపబడుతుంది. నీకు పట్టుదల వుంటే తెలివి దానంతట అదే వస్తుంది. ఈ రెండూ వుంటే డబ్బు ఒక ప్రవాహం అవుతుంది. ★★

→•←

నీ గతం ఎంత మంచిదయినా సరే, వర్తమానం బావోలేకపోతే ఎవరూ నీ గొప్పతనాన్ని గుర్తించరు. వర్తమానం బాగా వుంటే గతం బాగా లేకపోయినా ఫర్వాలేదు. ★★★

→•←

నిన్నెవడయినా తప్పు పట్టాడంటే, నువ్వు తప్పు చేస్తున్నావని కాదు. నువ్వు చేస్తున్నపని వాడికి నచ్చలేదన్నమాట. ★★★★★

→•←

తన కిష్టమైనట్టు బ్రతకాలి అనుకోవటం అందరూ చేసేది. ఇష్టమైనట్టు బ్రతకటం కోసం ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ గడిపేది మధ్యములు చేసేది. తమ కిష్టమయినట్లు బ్రతికేది గెలిచిన వాళ్ళు చేసేది. ★★★★

→•←

యాభై ఏళ్ళ వయసులో ఇరవై ఏళ్ళ జ్ఞానంతో ప్రపంచాన్ని చూసినవాడు, ముఫ్పై ఏళ్ళ అనుభవాన్ని వృథా చేసుకుంటున్నాడన్నమాట. ★★★

→•←

గెలుపంటే ఎక్కడికి వెళ్ళాలో తెలియటం కాదు! వెళ్ళాక ఎక్కడ ఆగాలో తెలియటం!! ★★

⇥•⇤

స్నేహం భగవంతుడిచ్చిన ప్రసాదంలా ఎన్నడూ స్వీకరించకు. నిర్ణయం నీది. ఎంపిక నీది. ★★

⇥•⇤

ప్రతి ఒక్కరికీ నువ్వు నచ్చుతున్నావంటే, నీకు నష్టం కలిగించే తప్పుదార్లో నడుస్తున్నా వున్నమాట. ★★★

⇥•⇤

జీవితం పాపులారిటి పోటీ (కంటెస్ట్) కాదు కాబట్టి, ప్రజలు నీకు ఓటు వెయ్యరేమో అని భయపడకు. నీ అవసరం వుంటే చచ్చినట్టు నీకు ఓటు వేస్తారు. అలాంటి 'నీ' అవసరాన్ని వారికి కలిగించు. నీ మంచితనంతోనో, స్నేహంతోనో, చెడ్డతనంతోనో, కలుపుగోలుతనంతోనో, రౌడీయిజంతోనో, భగవత్ ప్రవచనం చెప్పో, కీర్తితోనో, అధికారంతోనో, సేవతోనో, డబ్బుతోనో, దయాగుణంతోనో, భయంతోనో తప్పనిసరిగా నీ అవసరం వారికి కలిగే పరిస్థితులు సృష్టించు.★★★

⇥•⇤

నీ శత్రువు కాని వాడికి అనవసరంగా ద్రోహం చెయ్యకు. వీలైతే సాయం చెయ్యి. దానివల్ల నీకు ఆనందం కలుగుతుంది. ★★

⇥•⇤

ఎప్పుడు నిజం చెప్పాలో, ఎప్పుడు అసత్యమాడాలో తెలుసుకోవటమే నిబద్ధత.

★★

⇥•⇤

నీ పై దుర్విమర్శ అంటే విమర్శకుడికి సంతోషం కలిగించేది. సద్విమర్శ అంటే – నీకు లాభం కలిగించేది. ★★★

→•←

....మనిషికి ప్రకృతి రెండు గమ్యాలు చూపించి ఒక దాన్ని ఎన్నుకోమంటుంది. ఒకటి ఆకర్షణీయం మరొకటి అపూర్వం. రెండోదాన్ని చేరుకోవాలంటే మొదటి దాని మత్తునుంచి బయటపడాలి. ★★

→•←

కష్టపడటం అంటే నిద్రహారాలు మాని పని చెయ్యటం కాదు. గోళ్ళు కొరుక్కుంటున్నప్పుడు గోళ్ళమీదే శ్రద్ధ చూపించటం! ★★★

→•←

నీ తండ్రి కాలిగోళ్ళు తీసి ఎంత కాలమయింది? నీ తల్లి చేతికి గోరింటాకు పెట్టి ఎన్నాళ్ళయింది? నీ చెల్లికి జడవేసావా ఒకసారైనా? అదే ప్రేమ ప్రకటన అంటే! ★★★

→•←

బాణం ఎప్పుడు వదలాలో సరీగ్గా తెలుసుకోవటం వేటకి సంబంధించిన గొప్ప కళ. రంగం నుంచి ఎప్పుడు రిటైర్ అవ్వాలో తెలుసుకోవటం గెలుపుకి సంబంధించిన గొప్ప కళ. ★★

→•←

ప్రతి మొగవాడి విజయం వెనుకా ఒక స్త్రీ వుంటుంది. అపజయం వెనుక ఇద్దరు స్త్రీలుంటారు. ★★

→•←

ఓడిపోయేవాడు ఒక్కసారే ఓడిపోతాడు. గెలిచేవాడు తొంభైతొమ్మిదిసార్లు ఓడిపోతాడు. వందసార్లు ప్రయత్నిస్తాడు కాబట్టి. ★★★★★

→•←

ఈ ప్రపంచంలో చాలామంది తాము ఎంత Openగా, నిజాయితీగా వుంటే అవతలి వారికి తమ మీద అంత మంచి అభిప్రాయం కలుగుతుందనుకుంటారు. కానీ నిజాయితీ అన్నది కత్తిలాంటిది. అవతలి వారికి కావల్సింది నీ నిజాయితీ కాదు. నీ నోటి వెంట వారికి నచ్చే మాటలు రావటం! వారికి నచ్చే పనులు నీవు చేయటం! మరొక ముఖ్య విషయం ఏమిటంటే నీవు Openగా వుండే కొద్దీ నీ మీద అవతలి వారికి గౌరవం తగ్గిపోతుంది. నువ్వు Openగా నీ విషయాలన్నీ మాట్లాడేస్తున్నావూ అంటే ఇతరులతో మోసగింపబడటానికి సిద్ధంగా వున్నావన్నమాట! ★★

→•←

ఈ ప్రపంచంలో మోసగాళ్ళందరూ ఎప్పుడూ రకరకాల అబద్ధాలు ఆడుతూ వుంటారనీ, అందమైన కట్టుకథలు విపరీతంగా చెప్పేస్తూ వుంటారనీ, మామూలు మనుషుల కన్నా వాళ్ళు చాలా డిఫరెంట్‌గా వుంటారనీ నువ్వనుకుంటే అది చాలా తప్పు. వాళ్ళూ నీలాగే వుంటారు. వారి Sincerityని Honestyగా ఎప్పుడూ భావించకు. సిన్సియారిటీ అంటే శ్రద్ధ. హానెస్టీ అంటే నిజాయితీ. 'అతడు చాలా సిన్సియర్' అనటానికీ 'అతడు చాలా హానెస్ట్' అనటానికి చాలా తేడా వుంది. నమ్మకద్రోహులే ఒక్కొసారి చాలా శ్రద్ధగా వుంటారు. ★★

→•←

వేగంగా పరుగెత్తే గుర్రాలు పూన్చిన రథం రాజు ఎక్కుతాడు. చోదకుడు ఎంతో చాకచక్యంతో దాన్ని నడుపుతాడు. భటులందరూ రక్షణగా చుట్టూ నిలబడతారు. అప్పుడు రాజు పులిని చంపుతాడు. ఖ్యాతి ఎవరికొచ్చింది. గుర్రాలకా? చోదకుడికా? భటులకా? ★★

⇥•⇤

ఒక సంస్థలో నువ్వు పైకి రావాలీ అంటే నీ పై వారిని సంతృప్తి పరచాలి. 'సంతృప్తి పరచటం' అంటే తమ తెలివి తేటల్ని చూపించటమనీ, కష్టపడి పని చేయటమనీ చాలామంది అనుకుంటారు. ఇది చాలా తప్పు. కావల్సింది కష్టపడి పని చేయటం కాదు. పై అధికారులు ఇష్టపడేలా పనిచేయటం. ★★

⇥•⇤

గమ్యం తరువాత గమ్యం పెట్టుకోవటమే జీవిత గమ్యం. ★★★★★

⇥•⇤

ప్రతి అధికారీ, తన క్రిందివారి కంటే తాను తెలివైన వాడిననీ, తనకి సబ్జెక్టు ఎక్కువ తెలుసనీ అనుకుంటూ వుంటాడు. అతడిని ఆ నమ్మకంలోనే వుంచు. నీ 'తెలివి' వల్ల అతడికి లాభం కలిగినంత కాలం పర్వాలేదు గానీ..... 'భయం' కలగటం ప్రారంభమయితే మాత్రం నిన్ను వదిలించుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాడు. ★★

⇥•⇤

నీ పై వాడు సూర్యుడు. నువ్వు నక్షత్రానివి. సూర్యుడున్నంత వరకూ నక్షత్రపు వెలుగు కనిపించదని గ్రహించు. పగలుని అతడికి వదిలెయ్యటం వలన రాత్రి నీదవుతుందని తెలుసుకో. నెమ్మదిగా వ్యాపించు. ఆ తరువాత నువ్వే సూర్యుడివి

అవుతావు. అప్పుడు మాత్రం నీ నక్షత్రాల్ని జాగ్రత్తగా ఎన్నుకో. కాబోయే సూర్యులు అందులో ఎవరూ వుండకుండా చూసుకో. ★★★

→•←

అవకాశం తలుపు తట్టటం లేదని ఏడవకూడదు. దానికన్నా ముందు తన గదికి తలుపు వున్నదో లేదో చూసుకోవాలి. ★★

→•←

వర్తమానంలో చేస్తున్నది పిల్లలు చెప్తారు. గతంలో చేసింది వృద్ధులు చెప్తారు. చెయ్యాలనుకున్నది ఎప్పటికీ చెప్తూనే వుంటారు మూర్ఖులు. ★★

→•←

సంతోషం ఒక వృత్తం లాటిది. హృదయమూ, చేతులూ, కళ్ళు – ఆ మూడిటి మధ్యా పూర్తయ్యే వృత్తమే సంతోషమంటే. నీ హృదయంలోంచి అంకురించిన కోరికని తీర్చుకోవటం కోసం, నీ చేతులు చేస్తున్న పనిని చూస్తున్నప్పుడు, నీ కళ్ళు ఆనందంతో వర్షిస్తాయి. ★★

→•←

బద్ధకం ఆకర్షణీయమైనదే. కాని పని తృప్తికరమైనది! ★★★★★

→•←

ఇతరులు విమర్శిస్తున్నప్పుడు నువ్వు ఆలోచించు.

ఇతరులు నిద్రిస్తున్నప్పుడు నువ్వు ప్రణాళిక వెయ్యి.

ఇతరులు తటపటాయిస్తున్నప్పుడు నువ్వు నిర్ణయం తీసుకో.

ఇతరులు మాట్లాడుతున్నప్పుడు నువ్వు విను.

ఇతరులు వాయిదా వేస్తున్నప్పుడు నువ్వు పనిచెయ్యి. ★★★

→•←

ప్రతి మొగవాడి విజయం వెనుక ఒక స్త్రీ వుంటుంది. ఆ స్త్రీ వెనుక అతడి భార్య వుంటుంది. ★

→•←

తప్పనిసరిగా రెండు తప్పుల్లో ఒకదాన్ని చెయ్యవలసి వచ్చినప్పుడు, అంతకు ముందు చెయ్యని దాన్ని చెయ్యి. అంతకుముందు చేసింది తప్పు అని నిర్ధారణ అయిపోయింది కాబట్టి ఇది తప్పు కాకుండాపోయే అవకాశం వుంది. ★★

→•←

నచ్చటం అనేది రకరకాలుగా వుంటుంది. శరీరం నచ్చటం, ప్రవర్తన నచ్చటం, తెలివితేటలు నచ్చటం, డబ్బు నచ్చటం.....అంతే తప్ప టోటల్‌గా ఒకరికొకరు నచ్చటం అంటూ ఏమీ వుండదు. అవతలివారి మంచితో పాటు వారి బలహీనతల్ని పట్టించుకోకపోవటం 'సర్దుబాటు'. కొన్ని నచ్చటంతో మరికొన్నిటిని ఇష్టపడటం 'ప్రేమ'. డబ్బు నచ్చటంతో మిగతావి వదిలిపెట్టటం 'వ్యాపారం'. అధికారం నచ్చటంతో విలువలు వదిలి పెట్టటం 'రాజకీయం'. దేనికోసం ఏది వదిలిపెట్టాలో తెలుసుకోవటం 'జీవితం'. అంతే. ★★

→•←

నీ కర్మ భగవంతుడే వ్రాసాడనీ, విధి నిన్ను ఆ విధంగా నడిపిస్తుందనీ అనుకోవటం శుద్ధ పొరపాటు. నీ కష్టాల్ని భగవంతుడే సృష్టించాడనుకుంటే, అటువంటి ఫ్యూడలిస్ట్‌నీ, శాడిస్ట్‌నీ, నీ కష్టాల్ని తీర్చటం కోసం ప్రార్థించటం ఎందుకు? అది నీ కర్మ కాదు. ఖర్మ. ★★★

→•←

నువ్వు ఎల్లప్పుడు చాలా సెంటిమెంటల్‌గా, కాస్త సిగ్గుగా, మంచిగా, మర్యాదగా, మొహమాటంతో వుండాలని నీ చుట్టూ వున్న వారంతా ఆశిస్తారు. నిన్ను చాలా Open mindతో వుండమని సలహా ఇస్తారు. అలా ఓపెన్‌గా వున్నప్పుడు ఆ dustbin లో తమ చెత్తంతా వేయటం కోసం. ★★★★★

⇥•⇤

లంచగొండి ఇనస్పెక్టర్‌ని హీరో కొడ్తూంటే ఆ సినిమా చూసి ఆనందించే ఫ్యామిలీస్‌లో సగం శాతం లంచగొండులు. లేదా లంచం దొరికే ఛాన్స్ లేనివారు. చిత్రమేమిటంటే, సమాజం మారాలని వీరు నిరంతరం కోరుకుంటూనే వుంటారు. ★★★

⇥•⇤

గాలి పటం గాలితో పా..టు.. ఎగరదు. గాలికి వ్యతిరేకంగా ఎగురుతుంది. గాలి బలం ఎక్కువయ్యే కొద్దీ, దాని ఎత్తు పెరుగుతుంది. ★★

⇥•⇤

అకస్మాత్తుగా ఒక కష్టం వచ్చినప్పుడూ, అనుకోకుండా అమితమైన సంతోషం కలిగినప్పుడూ ఎక్కువ మాట్లాడకు. కష్టంలో నీ మౌనమే నిన్ను రక్షిస్తుంది. సంతోషంలోని అతి వాగుడు నిన్ను కష్టంలో పడేస్తుంది. టెన్షన్‌లో అతి వాగుడు నిన్ను చులకన చేస్తుంది. సుఖంలోనూ, కష్టంలోనూ నీ గాంభీర్యమే నీ స్థిత ప్రజ్ఞత. ★★

⇥•⇤

తన జీవితకాలంలో రెండు అశాంతుల మధ్య తాత్కాలిక కాలాన్ని 'శాంతి' అనుకోవలసి రావటం ఒక వ్యక్తి చేసుకున్న దురదృష్టం. శాంతి అంటే ఏ సమస్యా లేకపోవటం కాదు. మనసు ఆహ్లాదంగా వుండటమే శాంతి. అలా కాని పక్షంలో అది బద్ధకం అవుతుంది. ★★

→I•I←

ఒక ఆనందం కలగాలీ అంటే ఒక కష్టం వుండాలి. ఒక సంతోషం కలగాలీ అంటే ఒక సమస్య తీరాలి. ఒకటి లేకపోతే మరొకటి లేదు. ★★

→I•I←

'ఈ రోజు ఏ సమస్యా రాలేదు. నేను సుఖంగా వున్నాను.' అనుకోవటం కాదు ప్రశాంతత అంటే! పక్షుల కిలకిలరవాల్తో ప్రత్యూషంలో నిద్ర మేల్కొనటం శాంతి! లేవగానే ఆ రోజు జరగబోయే ఒక సంఘటనని హాయిగా తల్చుకోవటం శాంతి! ఆ సంఘటన తల్చుకోగానే మనసు ఆనందోద్వేగాల్తో ఉప్పొంగటం శాంతి! నిరంతరం సంతోషంగా వుండటం శాంతి! అలా వుండేలా జీవన విధానాన్ని నిర్మించుకోవటం శాంతి! మధ్యలో వచ్చే ఇబ్బందుల్ని ఎదుర్కోవటం కోసం చేసే యుద్ధం కూడా శాంతే! ★★★★

→I•I←

'నేను చాలా మంచిదాన్ని' అనుకుంటూ వుంటుంది మేక. నిజంగానే అది ఎవర్నీ మోసం చెయ్యదు. తన మానాన తన గడ్డి తింటూ బ్రతుకుతుంది. ఇతరులకి హాని తలపెట్టడం అంటే ఏమిటో దానికి అస్సలు తెలీదు. సాధుజంతువు! అయినా పులి దాన్ని చంపుతుంది. పైగా దాని తోలు వలుస్తుంది. అవసరం వచ్చినప్పుడు మేకవన్నె పులిగా మారటం కోసం ఆ తోలు వాడుకుంటుంది. ★★

→I•I←

నువ్వు మంచిగా బ్రతుకుతూ, ఎవరికీ హాని తలపెట్టకుండా వుంటే నీకు శత్రువులు వుండరని అనుకోవద్దు. నీ తప్పు ఏమీ లేకపోతే నీకు కష్టాలు రావని భ్రమించవద్దు. నీవు ఏ తప్పు చేయకపోతే శిక్ష పడదని భావించవద్దు. ఈ ప్రపంచంలో ఏ మనిషికయినా వచ్చే కష్టాల్లో సగం పైగా కష్టాలు, అతడి తప్పేమీ లేకుండా వచ్చేవే. ★★★★★

→|•|←

నువ్వు ఖర్చు పెట్టేది భౌతికమైనదీ (డబ్బూ, కాలమూ, నీ ఆరోగ్యమూ వగైరా) నీకు వచ్చేది మానసికమైనదీ (తృప్తి, ప్రేమ, కర్తవ్య నిర్వహణ వలన కలిగే ఆనందం) అయినప్పుడు, ఏది నీకు ఎక్కువ విలువైనదో తెలుసుకుంటే, ఆ తరువాత నీకు వ్యధ, బాధ, దేనికోసమో ఏదో కోల్పోయానన్న భావన కలుగవు. ★★★

→|•|←

నువ్వు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నిన్ను అవుట్ చేసేది నీ ప్రత్యర్థికాదు. నీలోని టెన్షన్. నువ్వు ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు నీ గోల్‌లోకి బంతి కొట్టేది అవతలి జట్టు ఆటగాడు కాదు. నీ అలసత్వం. నీవు హైజంప్ చేస్తున్నప్పుడు అడ్డుగా వుండేది రాడ్ కాదు. నీలోని పిరికితనం. ★★★★★

→|•|←

రైట్ సోదరుల మొట్ట మొదటి విమానం ఆకాశంలోకి వెళ్ళలేదు. అపనమ్మకం లోంచి నమ్మకంలోకి దూసుకుపోయింది. ★★★

→|•|←

సమస్య వచ్చినప్పుడు నాలుగు అంశాల్ని ఆలోచించు.

1) దీని వలన నేనేమి నష్టపోతాను?

2) ఆ నష్టపోయిన దాన్ని తిరిగి ఎలా సమకూర్చకోగలను?

3) దానికి ఎంతకాలం పడుతుంది?

4) ఏం చేస్తే నష్టాల్నీ , కాలాన్నీ (Period) తగ్గించుకోగలను?

ఇంతే నాలుగే అంశాలు. అయితే ఈ అంశాల్లో "కష్టం ఎందుకొచ్చింది?" అన్న పాయింటు లేదు చూడు. అదే విధంగా "కష్టం ఎవరి వలన వచ్చింది?" అన్న పాయింటు కూడా లేదు. చూడు. చాలామంది ఒక సమస్య రాగానే, 'కష్టం' ఎందుకొచ్చింది? ఎవరి వలన వచ్చింది? అన్న విషయాలపై ఆలోచిస్తూ ఎక్కువ సమయం వృథా చేస్తారు. అది నిష్ఫలితమని తెలిసినా సరే. ★★★★★

→•←

ఓ ప్రకృతీ! అన్నీ ఉన్నప్పుడు నువ్వు ఇచ్చిన బహుమతుల విలువ తెలియలేదు. కోట్లు కొట్లు ఖర్చుపెట్టినా దొరకని చెవి, ముక్కు, నోరు, చర్మం, కళ్ళు అనబడే పంచ జ్ఞానేంద్రియాల్ని ఇచ్చావు. వాటి విలువ తెలియక, మా దుఃఖంతో వాటిని ఇబ్బంది పెడుతున్నాం. వాటిలో ఏ ఒక్కటి లేకపోయినా 'అసలు బాధ' అంటే ఏమిటో మాకు తెలిసేది. ★★

→•←

ఈ ప్రపంచంలో చాలా మంది నమ్మే విలువలు వేరు. ఆచరించేవి వేరు. ఒప్పుని నమ్ముతూ, తప్పుని కొనసాగిస్తున్నారు. ★★

→•←

నోటి చాపల్యంతో చేప గేలానికి ఇరుక్కున్నట్టు, చెవుల చాపల్యంతో పాము నాదస్వరానికి లొంగిపోయినట్టు, కంటి చాపల్యంతో పురుగులు మంటలో పడినట్టు, మనసు చాపల్యంతో తాను కష్టాలకు గురి అవుతున్నానని తెలుసుకోవటమే జ్ఞానం.

★★★★★

→|•|←

సామాన్యుడు ఎవరేం చెప్పినా నమ్ముతాడు. ఎలా? ఎందుకు? అని ఆలోచించడు.

హేతువు వున్నదా లేదా? ఇదెలా జరుగుతోంది? అని తెలివైనవాడు తర్కిస్తాడు.

తనకి తెలియని హేతువు కూడా వుండొచ్చు కదా. కారణం వున్నదే కరెక్టనుకోవటం దేనికి? అని మేధావి ఆలోచిస్తాడు.

హేతువు కన్నా, తనకి గానీ, ప్రపంచానికి గానీ ఆ పనివల్ల వచ్చే 'ఉపయోగం' గురించి జ్ఞాని ఎక్కువ పరిశీలిస్తాడు. ★★

→|•|←

పూర్వం పిరమిడ్లు కట్టించే రాజులు బానిసల్తో పని చేయించటం కోసం కొరడాల్తో కొట్టేవారట. ఇప్పుడీ కంప్యూటర్ అధిపతులు డబ్బుతో కొడ్తున్నారు. కళ్ళూ, నడుమూ పాడయ్యే వరకూ పనిచేయిస్తూనే వుంటారు. ★★

→|•|←

ఒక ఆలోచన రాగానే వెంటనే ఇక తలుపులు మూసేసి, వచ్చిన ఆలోచనని ఎలా బలోపేతం చేయలా అని ఆలోచించకు. అదే కరెక్ట్ అని మనస్ఫూర్తిగా, ఎమోషనల్‌గా నమ్మకు.. కొత్త ఆలోచన వచ్చే సమయాన్ని కూడా, పాతదాన్ని పట్టిష్టం చేయటానికి ఉపయోగించకు. నీ నిర్ణయం కరెక్ట్ అని ఇతరులని కన్విన్స్

చేయటానికి కావలసిన వాదనలు ఏమిటా అని ఆలోచిస్తూ సమయాన్ని వృధా చేసుకోకు. ★★★

→•←

తెలివైనవాడికీ, సామాన్యుడికీ తేడా ఏమిటంటే.... ఆలోచిస్తున్నప్పుడు తెలివైన వాడు ఒక నిర్ణయం తీసుకోడు. వీలైనన్ని ఆలోచనల్ని రానిస్తాడు. ఆ తరువాత వాటన్నిటినీ విశ్లేషించుకుంటాడు. చివరి వరకూ తన జడ్జిమెంటుని వాయిదా వేసుకుంటాడు. ★★★

→•←

ఒక ఆలోచన రాగానే ఆగిపోతే, మరో మంచి ఆలోచన మిస్ అవ్వొచ్చు. ఒక మంచి ఆలోచన రాగానే ఆగిపోతే, ఒక అద్భుతమైన ఆలోచన మిస్ అవ్వొచ్చు. ఒక అద్భుతమైన ఆలోచన దగ్గిర ఆగితే, ఒక సరి అయిన ఆలోచన మిస్ అవొచ్చు.

★★★★★

→•←

మనిషి ఎలా సంతృప్తిగా బ్రతకాలో చెప్పేదారిలో, ఒక మైలురాయి లాంటి వాడు భగవంతుడు. కర్తవ్య నిర్వహణ మానేసి కేవలం అతణ్ణి పూజించేవాడు. ప్రయాణం మానేసి 'మైలురాయి' ని పూజిస్తున్న వాడి క్రింద లెక్క. ★★★★★

→•←

ఈ నవ నిర్మాణంలో కుటుంబ వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమై పోతోంది. పిల్లలు బాల్యాన్నీ, పెద్దలు యవ్వనాన్ని కోల్పోతున్నారు. దేనికోసం ఏది వదులుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. జీవితాన్ని ఆనందించటానికి బదులు, కర్తవ్యం నిర్వహిస్తే చాలు అన్న అభిప్రాయం ఎక్కువైంది. సంతోషం స్థానే సుఖం చోటు చేసుకొంటోంది. పిల్లల్ని కార్పొరేట్ స్కూళ్ళకీ, శరీరాన్ని కార్పొరేట్ కంపెనీలకీ,

కళ్ళని ఆదివారాలు టి.వి. ప్రోగ్రామ్‌లకి అప్పచెప్పి బ్రతకటమే రొటీన్ అయిపోతుంది. ★★

→•←

ఈ రాజకీయ నాయకులందరూ సర్వనాశనం అయిపోయినా మనకేమీ తేడా వుండదు. పైగా దేశానికి అనవసరమైన ఖర్చు తగ్గుతుంది. ★★★

→•←

ధైర్యం అంటే 'రేపు వెలిగించటం కోసం నిన్నటి రోజే దీపాన్ని తయారు చేసి వుంచుకున్నామన్న ధీమా'. ★★★★

→•←

చావు అన్నది జీవితపు అతిగొప్ప ఆఖరి సాహసం! జీవితాన్ని ఇంకా ప్రారంభించని వాడే చావు గురించి భయపడతాడు. ★★★

→•←

చెడు అన్నదాన్ని దేవుడు ఎన్నడూ సృష్టించలేదు. అది కేవలం మనిషి సృష్టించుకున్న పదం. తనకి నష్టం కలిగించే దానికి 'చెడు' అని పేరు పెట్టుకున్నాడు. ఏ బిందువు దగ్గిర వెలుగు చీకటి గానూ, వేడి శీతలంగానూ మారుతుందో ఎలా చెప్పలేమో, అలాగే ఎప్పుడు, ఎక్కడ ఎలా మంచి 'చెడు'గా మారుతుందో ఎవరూ చెప్పలేరు. ★★★★

→•←

Uncertainty is inevitable, but worrrying is optional. Wound is inevitable, but suffering is optional. దురదృష్టం తప్పదు. బాధ నీ ఇష్టం. గాయం తప్పదు. వేదన నీ ఇష్టం! ★★

→•←

భగవంతుడు లేడనేవాడు, కేవలం తనకు తెలిసింది మాత్రమే వున్నదని నమ్మే మూర్ఖుడు. భగవంతుడు వున్నాడని వాదించేవాడు, తన సమయం వృధా చేసుకుంటున్న అజ్ఞాని. తనలో వున్న శక్తే భగవంతుడని నమ్మేవాడే జ్ఞాని. కానీ అంత శక్తి అందరికీ వుండదు. అందుకే వారికి దేవుడి అవసరం పడుతూ వుంటుంది. దేవుడు స్వయంగా ఏమీ చేయడని చెప్పటానికి రెండు గొప్ప ఉదాహరణలు ఏకలవ్వుడు, అర్జనుడు. ★★★

→|•|←

ప్రార్థనకన్నా మించి పెరిగిపోవటమే ప్రార్థన అన్న విషయం తెలుసుకోవటమే మోక్షం. ★★

→|•|←

మోక్షం అంటే శాంతి. దుఃఖం లేకపోవటమే శాంతి. దుఃఖం ఒక పదార్థం కాదు. అదొక ఆలోచనా విధానం. దుఃఖానికి కారణం కోరిక. ★★★

→|•|←

జ్ఞానం, హేతువు, ఇంగిత జ్ఞానం అనే మూడు ప్రకృతి మనిషికిచ్చిన వరాలు. మూర్ఖుడు మాత్రమే వాటిని పారేసుకుంటాడు. ★★

→|•|←

జీవితం అనే వాహనం ఎక్కి కర్తవ్యం దారిలో ప్రయాణం ప్రారంభించు. యవ్వనం అనే పల్లం వస్తుంది. బ్రేకులు వెయ్యకపోతే పశ్చాత్తాపం అనే చెట్టుకు గుద్దుకుంటావు. వ్యసనం అని ఎడమవైపు బోర్డు కనపడుతుంది. అటు వెళ్తే ఊబిలో వాహనం ఇరుక్కుపోతుంది. తిన్నగా వస్తే సమస్యల గతుకుల రోడ్డు వస్తుంది. బంధం అనే అడవిలోంచి ప్రయాణం చెయ్యాల్సి వుంటుంది. లోభం అనే

జలపాతాలూ, స్వార్థం అనే లోయలూ ఆహ్వానిస్తాయి. వాటి మాయలో పడకు. నమ్మకం అన్న బోర్డు దగ్గిర ఆగు, అక్కేడ 'శాంతి' అనే ఉద్యానవనం ఉంటుంది. నీకు నీవే గాడ్, గైడ్, గార్డ్...... ★★★★★

→•←

నష్టాల్ని కలిగించే దాన్ని – అదెంత గొప్ప ఆచారమయినా, నమ్మకమైనా చరిత్రలో ఎప్పటినుంచో వున్నదయినా – దాన్ని నాశనం చెయ్యటం, చంపటం పాపం కాదు. "కాఫిరోంకో (అరిషడ్వర్గములైన కామ, క్రోధముల్లాటి శత్రువులను) పహలే ఖతమ్ కరో (ముందు చంపెయ్యి). బాద్మె నమాజ్ కరో (తరువాత ప్రార్థన చెయ్యి)" అని ఖురాన్ చెప్పినా, "పాప రహితుడివై ప్రేమతో తలుపుతట్టమ" ని బైబిల్ చెప్పినా అదే అర్థం .... " ★★★

→•←

విజయంలో భాగస్వామ్యం

ప్రస్తుత జీవన విధానంలో స్త్రీకి పురుషుడే జీవితం. పురుషుడికి స్త్రీ, తన జీవితంలో ఒక భాగం మాత్రమే. ★★

⇥•⇤

ఒకరోజు తెల్లవారుఝామున పాలకోసం స్త్రీ లేవక పోతే భూకంపం వస్తుంది. అదే పురుషుడైతే, బద్ధకంగా వుంటే క్యాజువల్ లీవ్ పడేస్తాడు. ★★

⇥•⇤

సెక్స్‌ని స్త్రీ ప్రేమకి పరాకాష్టగా భావిస్తే, పురుషుడు తన గెలుపుకి చిహ్నంగా భావిస్తాడు. ★★

⇥•⇤

పురుషుడు తన గుహలోకి, స్త్రీ తన నిర్లిప్తత సమాధిలోకి వెళ్ళి పోయేటట్లు చేసేది 'బేధాభిప్రాయం' అనే చలికాలం. కాని యిద్దరికి ఒక దుప్పటి చాలు అన్న నిజం తెలుసుకోవటానికి కూడా అది ఉపయోగపడుతుంది. ★★★

⇥•⇤

హనీమూన్‌కి వెళ్ళినప్పుడు భార్యకి రకరకాల ప్రదేశాలు చూడాలని, భర్తకు భార్యతోనే రూమ్ లోనే వుండాలని ఉంటే – ఈ చిన్న విబేధం చాలు మానసికంగా విడిపోవటానికి. ★★

⇥•⇤

రోజుకు ఒకసారి నువ్వు నీ భాగస్వామిని నవ్విస్తే 40 ఏళ్ళ సంసారంలో 14,160 సార్లు నవ్వించవచ్చు. ★★

⇥•⇤

సుఖప్రదమైన సంసారాలన్నీ ఒకేలాగుంటాయి. విషాదం తాండవించిన సంసారాలకు కారణాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. ★★

⇥•⇤

ఆనందం కోసం మనిషి ఏదో ఒకటి ఖర్చుపెట్టాలి. కీర్తికైతే కాలాన్ని, వ్యసనానికైతే డబ్బుని ఖర్చు చేయాలి. జీవిత భాగస్వామితో రోమాన్స్‌కి ఏ ఖర్చూ లేదు. ★★

⇥•⇤

పెళ్ళయిన కొత్తలో వుండే అవేశం కొంతకాలానికి వుండక పోవచ్చు. అప్పుడు ఆవేశం తగ్గి అనుబంధం పెరుగుతుంది. చీకటి పడేసరికి ఇంటికి వెళ్ళిపోదామనే ఆత్రం తగ్గితే తగ్గవచ్చేమో కానీ, ఇంటికి వెళ్ళాలి అన్న కోరిక మాత్రం నిశ్చయంగా పెరుగుతుంది. ★★★

⇥•⇤

కుతూహలం లేని ఏ విషయమూ ఆకర్షణీయంగా వుండదు. అందుకే మానసిక వర్జినిటీ, శారీరిక వర్జినిటీ ముఖ్యం. ★★

⇥•⇤

ఇల్లంటే ఎంత బావుండాలంటే, దాన్నించి దూరంగా వున్నప్పుడు – ఎప్పుడు వెనక్కి వెళ్ళిపోదామా అన్నంతగా మనసు తహతహలాడాలి. ★★★★★

⇥•⇤

దగ్గిరగా ఉన్న గడ్డి కన్నా దూరంగా ఉన్న బీడు నిశ్చయంగా పచ్చగా కనబడుతుంది. జీవిత భాగస్వామితో మిగతా వాళ్ళని పోల్చుకున్నా అంతే. ★★

⇥•⇤

భాగస్వామ్య సూత్రాల్లో అతి గొప్ప ప్రముఖమైన సూత్రం ఒకే ఒకటుంది. "....నేను నిన్ను అర్థం చేసుకోవటానికి నాకు సాయపడు. దీనికి ప్రతిగా నువ్వు చెప్పేదంతా శ్రద్ధగా వింటాను." ★★★★

⇥•⇤

ఎక్కడైతే భార్యాభర్తలమధ్య ప్రేమలేకుండా వుంటుందో – అక్కడ వివాహేతర ప్రేమ వుండటానికి అవకాశం వుంది. ★★

⇥•⇤

సంసారమంటే ఒంటరి తనం నుంచి నమ్మకంలోకి ప్రయాణం. ★★★★★

⇥•⇤

నమ్మకాన్ని అమ్మే డీలరు – 'లీడరు'. నిశ్చింతని అమ్మే డీలరు – 'భర్త' ★★

⇥•⇤

జీవితంలో భాగస్వామ్యం బ్యాంక్‌లో జాయింట్ అకౌంట్ లాంటిది. ఒక్కోసారి డబ్బులేకపోయినా చెక్‌లు ఇస్తూ వుంటాం. కానీ వెంటనే డిపాజిట్ చేయాలి. అదీ కమిట్‌మెంట్ అంటే. ★★

⇥•⇤

తాను నమ్మకపోయినా, 'నువ్వు చెప్పింది కరెక్టే అవొచ్చేమో' అని వప్పుకోవటం మంచి దంపతుల లక్షణం. ★★★

⇥•⇤

భాగస్వామ్యం అనేది ఎప్పుడూ సమానస్థాయి వ్యక్తుల మధ్యే సాధ్యమవుతుంది. సుస్థిరంగా కలకాలం వుంటుంది. ★★

⇥•⇤

వివాహం అనేది జీవితంలో భాగస్వామ్యం. అందులో దంపతులు పార్టనర్లు.

★★

→•←

ఒక తెలివైనవాడు – ఒక లౌక్యురాలు; లేదా.... ఒక నీచుడు – ఒక అమాయకురాలు; లేదా..... ఒక లౌక్యుడు... మరో గుణవతి కలిసి నడిపే భాగస్వామ్యాలు కలకాలం సజావుగా శాశ్వతంగా ఆరోగ్యకరంగా సాగవు. ★★

→•←

భార్యంటే – దారి తెలిసి, డ్రైవింగ్ తెలీని స్త్రీ. భర్తంటే డ్రైవింగ్ తెలిసీ, దారి తెలియని మొగాడు. అందుకే ఇద్దరూ 'కలిసి' ప్రయాణం చెయ్యాలి. ★★★★★

→•←

చాలామంది భర్తలు మోడ్రన్ పెయింటర్స్ లాంటి వారు. తమ భార్యల్ని – సముద్రం ఎర్రగానూ, ఆకాశం ఆకుపచ్చగానూ వుందని నమ్మించగలరు, తమ భార్యలు.... చెట్లు నీలంగా వుంటాయని తమని నమ్మిస్తున్నారన్న విషయం మాత్రం గుర్తించరు. ★★★

→•←

సంసారమంటే ఇద్దరు వివాహితులు ఒకే ఇంట్లో విడిగా వుండటం కాదు. అలా జరిగిందంటే కారణం ఒక్కటే. వ్యక్తిగత స్వాతంత్ర్యం (Independency) నుంచి పరస్పరాధారితం (Inter-dependency) వైపు వెళ్ళకపోవటం. ★★

→•←

ఇతరుల్ని (కనీసం భార్యబిడ్డల్ని) తృప్తి పర్చలేనివాడు తాను తృప్తిగా బ్రతకలేడు.

★★

→•←

ఒక స్త్రీ తాలూకు సమస్యల పరిష్కారించటానికి ఉత్తమ మార్గం, ఆమె చెప్పేది చివరి వరకూ వినటం మాత్రమే. ★★★

→•←

'నన్ను నువ్వు సరీగ్గా వినటం లేదు' అంటుంది భార్య అది కూడా వినడు భర్త.

★★

→•←

భయంవలన చేసుకునే రాజీ, యుద్ధం కన్నా ప్రమాదకరమైనది. ★★★

→•←

ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో కరెక్టుగా తెలుసుకుని, అన్ని రహస్యాలనీ తన భాగస్వామికి చెప్పేసినట్టు భ్రమ కల్గించటం లౌక్యం. విజయవంతమైన భాగస్వామ్యానికి ఆ మాత్రం లౌక్యం అవసరం. ★★★

→•←

వివాహంలో శారీరక శాస్త్రం, భౌతిక శాస్త్రం, లెక్కలూ గుణింతాలు, రసాయన శాస్త్రం, మానసిక విశ్లేషణలూ – ఇవేవీ వుండవు. కేవలం స్నేహం, ప్రేమ, పరస్పర ఆధారం – ఇవే వుంటాయి. ★★★

→•←

మంచి సంసారాన్ని దేవుడు సృష్టించడు. భార్యభర్తలు కలిసి సృష్టిస్తారు. ★★★★

→•←

వివాహం అంటే ఒకే వ్యక్తితో చాలాసార్లు ప్రేమలో పడటం. ★★★★★

→•←

నిరంతరం ఘర్షించే దంపతులు చివరికి చేరేది నిర్లిప్తతలోకి. ★★★

→•←

యవ్వనం అనేది వయసు మీద ఆధారపడి వుండదు. జీవితం పట్ల ఉత్సాహం వున్నవారందరూ యవ్వనవంతులే. ★★★

⇥•⇤

ఒకే విషయానికి పురుషుడు ఒకలా స్పందిస్తే, స్త్రీ మరోలా స్పందిస్తుంది. ★★

⇥•⇤

ఏ భార్యా భర్తా, ఏ సమస్యా లేకుండా పాలూ నీళ్ళలా కలిసిపోవటం అసాధ్యం. ★★★

⇥•⇤

సమస్య అనేది, దాంపత్యం గట్టిపడటానికి భగవంతుడు సమకూర్చిన అవకాశం మాత్రమే. ★★

⇥•⇤

మిగతా అన్ని చోట్ల ' గెలవటం' విజయం. సెక్స్‌లో 'గెలిపించటం' విజయం.

★★★★★

⇥•⇤

ఒక కుర్రవాడి ముందు ఎప్పుడూ దెబ్బలాడుకోని భార్యభర్తలు, ఆ కుర్రవాడి అత్యుత్తమ బాల్యాన్ని యిచ్చే తల్లిదండ్రులు. ★★★

⇥•⇤

ప్రతీదానికి ఏకాగ్రత అవసరం. అలానే దాంపత్యంలో రొమాన్స్‌కి కూడా ఏకాగ్రత కావాలి. ★★★

⇥•⇤

ఇచ్చి పుచ్చుకోవటాలు సమానస్థాయిలో జరిగేది సెక్స్‌లో మాత్రమే. ★★

⇥•⇤

ప్రేమ గుడ్డిది కాదు. అది చాలా ఎక్కువగా చూస్తుంది. అందుకే తక్కువ చూడాలనుకుంటుంది. ★★★

→•←

ఫస్ట్ ఇంప్రెషన్ బెస్ట్ ఇంప్రెషన్ అనేది ఎల్లవేళలా సత్యం కాదు. ఆకర్షణకీ, ప్రేమకీ వున్నతేడా అదే. ★★★

→•←

ప్రేమతో దేనినైనా జయించవచ్చు అనేది కేవలం పుస్తకాలలో చదువుకోగలిగే సిద్ధాంతం మాత్రమే. జీవితం అనే నాణేనికి ఒకవైపు బొమ్మ ప్రేమ అయితే, మరొకవైపు బొరుసు విచక్షణ. ★★★★

→•←

ఈ ప్రపంచంలో కనీసం పదిహేనుమంది ఏదో ఒక కారణం వల్ల మిమ్మల్ని ఇష్టపడుతూ వుండి వుంటారు. ★★

→•←

నీకున్న అతిగొప్ప స్నేహితుడెవరంటే ఒకరోజు సాయంత్రం మీరిద్దరూ నది ఒడ్డున కూర్చుని, ఎన్నో సుదీర్ఘమైన నిముషాలూ, గంటలూ మాట్లాడుకోకుండా మౌనంగా వుండి, ఇంటికి వెళ్తా వెళ్తూ ఇంతకన్నా అద్భుతమైన సంభాషణ మరొకటి లేదు అనుకోగలగటం. ★★★★

→•←

మనం చెప్పకపోతే, పిల్లలకి – వాళ్ళ అనుభవాలు చెప్తాయి. కానీ అవి చాలా ఖరీదైనవి. వాటి కోసం ఎక్కువ ఖరీదు (ఒక్కోసారి వాళ్ళు నష్టపోయేటంతగా) చెల్లించాలి. ★★★

→•←

ప్రారంభంలో అమాయకత్వమూ, చివరిలో తదాత్మ్యతా వుంటే దాన్ని 'ప్రేమ' అంటారు. ★★★★

→•←

స్త్రీ తీసుకోవటానకి భయపడుతుంది. పురుషుడు ఇవ్వటానికి భయపడతాడు. ★★★

→•←

అవతలి వారి మానసిక స్థితి తెలుసుకున్నవాడే గొప్ప ప్రేమికుడు అవుతాడు. ★★

→•←

రొమాన్స్ అంటే అదేదో వేశ్యలు చేయవలసిన పని అనుకునే స్త్రీలు దేశంలో సగానికి పైగా వుండటం దురదృష్టకరం. ★★★

→•←

రొమాన్స్ ఒక ఉద్యానవనం లాటిది. కొంచెం దూరం వెళ్ళి చూసి 'బావుంది' కదా అనుకుని వెనక్కి వచ్చేస్తే – ఆ అందం అక్కడితో ఆగిపోతుంది. ★★★★

→•←

పురుషుడు ఎంత గొప్ప వాడయినా, ఎంత డబ్బున్న వాడయినా, ఎంత ధీశాలి అయినా, బలవంతుడయినా, స్త్రీ ప్రేమించగల లక్షణాలు అతనిలో లేకపోతే అతడు నిజమయిన మగవాడు కాలేడు. ★★★★

→•←

ఏ భర్త అయినా భార్యని 'నీకు రొమాన్స్ సరిగ్గా చేతకాదు' అని ఎద్దేవా చేస్తే ఆ తప్పు ఆమెది కాదు. అతడిది. ఆమెని సరిగ్గా మలచుకోవటం చేతకాని అతడి అసమర్థతది. ★★★

→•←

కామశాస్త్రం తెలియని యువతీ యువకుల పొందు, మూలికల ప్రభావం తెలియని వైద్యుడి వైద్యంలాగా వుంటుంది. భూసారము, విత్తనాల బలము మొదలైన వ్యవసాయ పద్ధతులు తెలిసి చేసే విత్తనాల బలము మొదలైన వ్యవసాయ పద్ధతులు తెలిసి చేసే సేద్యానికీ, తెలియకుండా చేసే సేద్యానికీ తేడా వున్నది కదా! ★★★

→•←

ముద్దులో చాలా రకాలున్నాయి. 'థాంక్యూ' ముద్దు. 'నువ్వంటే నాకిష్టం' ముద్దు. నేన్నిన్ను ప్రేమిస్తున్నాను 'ముద్దు'. ప్రేమ ప్రసక్తి వద్దు. కానీ ఇంకొంచెం ముందు కెళదాం 'ముద్దు' - వగైరా వగైరా. ★★

→•←

రొమాన్స్‌లో అవతలి వ్యక్తి మనని ఏం చెయ్యాలనీ, ఎలా తృప్తి పర్చాలనీ మనం ఆశిస్తున్నామో – అదంతా మనం కూడా అవతలి వ్యక్తి పట్ల చేసి చూపించాలి!! అదే పర్‌ఫెక్ట్ రొమాన్స్!!! ★★★★★

→•←

ప్రతి దాంట్లోనూ అందం వుంది. చూడగలిగే కళ్ళు మాత్రం కొందరికే వుంటాయి. ★★★★

→•←

ముద్దుపెట్టుకుంటున్నప్పుడు శరీరపు నలుమూలల్నుంచీ అవయవాలన్నీ "ఆ సంతోషం మాక్కొంచెం పంచవా" అంటూ నరాల ద్వారా రాయబారం పంపిస్తాయట. అందుకే రెండు నిముషాల కన్నా ఎక్కువ ముద్దు పెట్టుకుంటే నరాలు ఆక్టివేట్ అవుతాయట. ★★★

→•←

శృంగార జీవితాన్ని డ్రైవింగ్ నేర్చుకోవటంతో పోల్చవచ్చు. అయితే ఇక్కడ ట్రయినర్ ఎవరూ వుండరు. ఎప్పుడు క్లచ్ నొక్కాలో, ఎప్పుడు గేరు మార్చాలో కేవలం మన యొక్క తెలివితేటల మీదే ఆధారపడి వుంటుంది. ★★

→•←

మీరు లేకపోతే ఈ ప్రపంచంలో ఎవరో ఒకరికి ప్రస్తుతం వారు వున్నంత ఆనందంగా వుండే అదృష్టం వుండి వుండేది కాదు. ★★★★★

→•←

దెబ్బలాడి, దిగుల్తో నిద్రలేని రాత్రి గడపటం కన్నా – రాజీ పడి, రొమాంటిక్‌గా కసి తీర్చుకుని హాయిగా నిద్రపోవటం మేలు. ★★★★

→•←

ప్రేమ అవసరమే. కానీ దాని మీదే ఆధారపడితే, న్యాచురల్‌గా దానికోసం ఎక్కువ మూల్యం చెల్లించవలసి వస్తుంది. ★★★

→•←

మూసి వున్న పుస్తకం – కొన్నికాగితాల సముదాయం మాత్రమే. అందుకే మూసి వున్న పుస్తకాలన్నీ ఒకేలా వుంటాయి! తెరవనంతవరకూ స్త్రీ కూడా అంతే!!

★★★★

→•←

ప్రేయసీ ప్రియుల మధ్య, భార్యాభర్తల మధ్య కూడా కొన్ని అదృశ్య సరిహద్దులుంటాయి. వాటిని దాటకూడదు. ★★

→•←

మంచి సెక్స్ అంటే నమ్మకం!! తన మీద తనకి నమ్మకం కాదు. అవతలివారు తనని తట్టుకోగలరన్న నమ్మకం. ★★

→•←

వివాహంలో ఏదీ రొటీన్‌గా జరక్కూడదు. భోజనం, శృంగారం, విహార స్థలం అన్నిటిలోనూ వెరైటీ కావాలి. భాగస్వామిలో తప్ప. ★★★

→•←

పడగ్గదిలో తప్ప ప్రతిచోట మనిషి తన గౌరవం నిలుపుకోవాలి. ★★★★

→•←

రైలుని కేవలం ప్రయాణం సాధనంగా వాడతారు కొందరు. కిటికీలోంచి ప్రకృతిని మనసారా ఆస్వాదిస్తూ ప్రయాణిస్తారు కొందరు. రొమాన్స్ కూడా అంతే. ★★★★★

→•←

సెక్స్‌లో ప్రావీణ్యత రావాలంటే పదిమందితో సంబంధాలవసరం లేదు. పది సంవత్సరాల అనుభవం అవసరం లేదు. అదే నిజమైతే సముద్రం గురించి మనిషికన్నా చేపకే ఎక్కువ తెలుసుండాలి. ★★★★

→•←

సాధారణ పరిస్థితుల్లో భాగస్వామిని స్పృశించి వారం కన్నా ఎక్కువ కాలం అయితే, కమ్యూనికేషన్ గ్యాప్ ప్రారంభమైందన్న మాట. ★★★

→•←

'నువ్వు అందంగా వున్నావు' అన్న నమ్మకాన్ని స్త్రీలో కలిగిస్తే ఆమె అందంగా వుండటం ప్రారంభిస్తుంది. ★★★★★

→•←

మనిషి ఒంటరితనానికి ప్రధమ శత్రువు – 'భాగస్వామి' అయివుండాలి. ★★★★

→•←

దాంపత్యం అనే కర్మాగారంలో ముఖ్య ఉత్పత్తి (ప్రొడక్టు) సహచర్యం అవుతే, బై – ప్రొడక్టు రొమాన్స్. ★★

→•←

అమాయకత్వం నుంచి బయటపడిన వాళ్ళు ప్రేమించలేరు. ప్రేమిస్తూ వుండగా అమాయకత్వం నుంచి బయటపడి, ఇంకా ప్రేమను కొనసాగించే వాళ్ల బంధాన్ని మాత్రం ఎవరూ విడదీయలేరు. ★★★

→•←

మొగవాడి ప్రేమని సంపాదించటానికి తనేమీ కష్టపడనవసరం లేదని, గేట్లు కాస్త తీస్తే అది ప్రవాహంలా వస్తుందనీ స్త్రీకి తెలుసు. అదంతా (మొదట్లో) ఆమెని గెలవటం కోసమేనని పురుషుడికీ తెలుసు. ★★

→•←

ఇతరుల కన్నా కాసింతయినా భిన్నంగా బ్రతకనివాడు జీవితంలో ఏ థ్రిల్లూ పొందలేడు. ★★★

→•←

ఈ ప్రపంచంలో పవిత్రమైన ప్రేమ అంటూ ఏమీలేదు. ఎందుకంటే ప్రేమకు అపవిత్రత ఆపాదించబడదు. చివరకు సెక్స్ కూడా ప్రేమను అపవిత్రం చేయలేదు. ★★★

→•←

ఇద్దరు వ్యక్తులు మధ్య గాఢమైన ప్రేమ వుండి, చాలాకాలం వరకూ చిన్న స్పర్శ అయినా లేకపోతే ఎక్కడో ఏదో లోపంగానీ, గొప్ప మెచ్యూరిటీ గానీ వున్నదన్నమాట. ★★★

→•←

నా భర్తకి శరీరాన్ని, నీకు మనసునీ ఇస్తానన్న ఆడదాన్ని నమ్మకు. నా భార్యతో వుంటూ నిన్ను ప్రేమిస్తానన్న మొగవాణ్ణి అస్సలు నమ్మకు. ★★★★★

→•←

ఆరోగ్యవంతులైన ఇద్దరు భార్యాభర్తల మధ్య రొమాన్స్ లేకపోతే 'మే మిద్దరం మంచి స్నేహితులం' అని వారు వాదిస్తే – అంతకన్నా పెద్ద ఆత్మ వంచన వుండదు. తప్పదు కాబట్టి బ్రతుకుతున్నారంతే. ★★★

→•←

'దాహం వెయ్యక ముందే నుయ్యి తవ్వు' అన్నదొక చైనీస్ సామెత. సెక్స్‌కి అది వర్తించదు. అవతలి వారి దాహం తీరే వరకూ నీ దాహం నిలబడి వుండాలి.

★★★

→•←

విజయం వైపు పయనం

మార్పుకి ఇష్టపడని వ్యక్తి, ఒక వస్తువుకి ఒక 'వ్యాల్యూ (విలువ)' ఆపాదించుకుంటాడు. మిగతా వాటి విలువలు గ్రహించటానికి ఇష్టపడడు. వాల్యూ జడ్జిమెంట్ లేకపోవటం అంటే అదీ! ★★

⇥•⇤

గొప్ప గొప్ప పారిశ్రామికవేత్తలకి వుండవలసిన లక్షణాల్లో మొదటిది – ఏ బంధాన్ని ఎక్కడ పాతెయ్యాలో తెలుసుకోగలిగి వుండటం. మెడకు గుదిబండగా తయారయ్యే అనవసర స్నేహాల్నీ, బంధుత్వాల్నీ నిర్దాక్షిణ్యంగా తెంచుకోగలగటం!! ★★

⇥•⇤

ప్రతి మనిషిలోనూ ఒక పరిమళం వుంటుంది. మనసులోంచి వచ్చే ఆ సుగంధం – స్వచ్ఛమైన కళ్ళద్వారా, కల్మషం లేని నవ్వు ద్వారా బహిర్గతమవుతూ వుంటుంది. ★★

⇥•⇤

న్యాయం వున్న ప్రతి చోటా తృప్తి వుండాలని రూలులేదు. ★★

⇥•⇤

....నిన్న నిన్ను గొప్పవాడిని చేసిన అంశం ఏదైతే వున్నదో, అది ఈ రోజు పనికి రాకపోవచ్చు. ★★★

⇥•⇤

భయం కలిగించే అడ్డంకులన్నీ, విజయం మీదనుంచి కళ్ళు తిప్పితేనే కనపడతాయి. ★★★★★

⇥•⇤

రెండు మిలియన్ సంవత్సరాల క్రితం వానరుడి నుండి మానవుడిగా మారిన జీవి, మొదట్లో శాకాహారిగా వుండి, క్రమంగా జంతుమాంసం రుచి చూసాడు. పక్క తండాల్ని గెలుస్తు, యుద్ధంలో గెలుపు రుచి చూసాడు. తండాల్ని వదిలి, స్వంతంగా కుటుంబాన్ని ఏర్పర్చుకుని ప్రేమ రుచి చూసాడు. ఆ తరువాత డబ్బు కలిగించే సుఖం రుచి చూసాడు. డబ్బు, అధికారం, కీర్తికోసం క్రమంగా కుటుంబాన్ని కూడా వదులుకునే స్వార్థం రుచి చూసాడు. ఆ విధంగా, శాకాహారం నుంచి మాంసాహారిగా (తోటి జీవాల్ని చంపటం), మాంసాహారం నుంచి రాజ్యాధినేతగా (తోటి మనుష్యుల్ని చంపటం) తండాల్ని వదిలి కుటుంబం నుంచి తానొక్కడిగా (ఇండివిద్యువలిజం) మారిన పరిణామక్రమంలో మిగతా ప్రాణాలన్నిటికీ వుండే విలువైన ఆస్థిని ఒకదాన్ని మనిషి పోగొట్టుకున్నాడు. దాని పేరు '....మనశ్శాంతి'. ★★★

→•←

జీవిత పాఠాల నుంచి ఏమీ నేర్చుకోలేని వాడు అన్నీ కరెక్ట్‌గానే చేస్తున్నాననుకుంటాడు. సమాజం నిర్దేశించిన సూత్రాల్లోనే బ్రతుకుతాడు. రిస్కు తీసుకోడు. జీవితంలో ఇం..కా... ఎ...ప్పు..డో... ఏ..దో జరుగుతుందని ఊహిస్తూ అశగా బ్రతుకుతూ చివరికి మరణిస్తాడు. ★★

→•←

ఈ రోజు పొద్దున్నే లేచాను. ఎంత పెద్ద గెలుపది! ★★

→•←

విజయం అంటే సంతృప్తి. ★★★

→•←

ఈ రోజు బాగుండాలంటే నిన్న బాగుండాలి – రేపు బాగుంటుందన్న నమ్మకం ఉండాలి. ★★★★

→•←

అప్పటివరకూ కష్టంగా వున్న పని, క్రమక్రమంగా సులభతర మవటానికి కారణం. పనిలో వచ్చిన మార్పుకాదు. చేసే మనిషిలో పెరిగిన శక్తి. ★★★

→•←

నీ సమస్యకి కారణం '....నేను' అని నువ్వు అనుకుంటే, నన్ను మార్చాలి. నువ్వే నీ సమస్య అనుకుంటే నువ్వు మారాలి. ఏది సులభమో ఆలోచించు. ★★★

→•←

సమస్య వయసు నిశ్చయంగా మన వయసుకన్నా చిన్నది. మనం పుట్టగానే ఒక సమస్యపుట్టి, మరణించే వరకూ మనతో పాటు అదే సమస్య వుండదు. ఈ నిజాన్ని అర్థం చేసుకుంటే మనకి విషాదమే లేదు. ★★★★

→•←

'కష్టం' కన్నా పై స్థాయికి వెళ్ళి ఆలోచించగలిగితే ఆ కష్టం వల్ల 'ఏడుపు' రాదు.

★★

→•←

"మంచి వాళ్ళకే కష్టాలు వస్తాయి" చాలా పాత సినిమా డైలాగ్ ఇది. కష్టాలు వచ్చాయి కాబట్టి మనం మంచివాళ్ళం అనుకోవటం అంతకన్నా స్టుపిడిటీ.

★★★★★

→•←

ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ వేర్వేరు ధృవాలైతే వాటి మధ్య రేఖ ఆత్మ విశ్వాసం. ★★★

→•←

ఇతరుల మీద విసుగు – వారిని నీకు దూరం చేస్తుంది. నీ మీద నీకు విసుగు – నిన్ను నీకు దూరం చేస్తుంది. ★★

→•←

భయం అనేది బూమెరాంగ్ లాంటిది. దానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తే అది అంత రెట్టింపు పరిణామంతో వెనక్కి వచ్చి భయపెడుతుంది. ★★★

→•←

ప్రతి మనిషీ స్నేహాన్ని కాంక్షిస్తాడు. ఆ స్నేహకాంక్షని పాలతో పోల్చవచ్చు. అవతలి వ్యక్తి ఇచ్చేది పంచదార అయితే మనలో కరిగిపోతుంది. ఉప్పయితే విరగ్గొడుతుంది. పెరుగయితే మన అస్థిత్వాన్ని మారుస్తుంది. నీరయితే పలుచన చేస్తుంది. మన పాలు ఎవరి ఎవరి పాలవ్వాలో మనమే నిర్ణయించుకోవాలి.

★★★★

→•←

ప్రతిరాయి తనలో ఒక శిల్పాన్ని దాచుకుని వుంటుంది. సుత్తితో బద్ధలు కొడితే శిల్పంరాదు. ఉలితో చెక్కాలి. అలాగే ప్రతి మనిషిలోనూ ఒక శక్తి వుంటుంది. బ్రహ్మాండం బద్ధలు కొట్టేద్దామన్న ఊహల్లో బ్రతికితే విజయం రాదు. కష్టమనే ఉలితో పట్టుదలగా చెక్కితేనే గెలుపనే శిల్పం బయట పడుతుంది. ఆ తపన లేని మనిషి రాయిలాగే బ్రతుకుతాడు. ★★★★

→•←

చాలామందికి 'పనిచేస్తే అలిసిపోతాం' అన్న దురభిప్రాయం వుంది. పని చేస్తే మనం అలసిపోము. ఎందుకంటే ఆ పని చేయకపోతే దాని బదులు ఇంకో పని చేస్తాం కాబట్టి. ★★★★★

→•←

కోపం వచ్చినప్పుడు పది వరకూ లెక్క పెట్టాలి. కష్టం వచ్చినప్పుడు అంకెలు లెక్క బెడుతూ కూర్చోకుండా పరిష్కార మార్గాన్ని ఆలోచించాలి. ★★★★

→•←

ఒక విషయం మనకి చేసే అపాయం కన్నా ఆ విషయం పట్ల మన ప్రతిస్పందన వల్ల వచ్చే అపాయం ఎక్కువ. ★★★

→•←

ఓటమి అంటే ఏమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే "కుతూహలం లేకపోవటం." ★★★

→•←

రిస్క్ తీస్కుంటే ప్రమాదమేమో అని భయపడకండి. రిస్క్ తీసుకునే మనస్తత్వం మీలో లేనందుకు భయపడండి. ★★★★

→•←

కనీసం మన పిల్లలనైనా ఒక వయసు వచ్చే వరకూ మన దగ్గర కూర్చోబెట్టుకుని రోజుకు గంటసేపు వాళ్ళకి పాఠాలు చెప్పకపోతే మనం ఎందుకు బతుకుతున్నట్లు? ★★

→•←

"ప్రస్తుత పోటీ ప్రపంచంలో One of the Best అయితే లాభం లేదు. Top of the Best అవ్వాలి".★★

→•←

ఒక గుడ్డి – మూగ – చెవిటి వ్యక్తి అరచేతిమీద నేనొక ప్రశ్న వ్రాశాను. "సంతృప్తి అంటే ఏమిటి" అని. జవాబు అతడికేం తెలుస్తుందిలే అని తేలిగ్గా అనుకున్నాను.

తెలిసినా, ఎలా చెప్తాడా అని ఉత్సుకంగా చూశాను. అతడు నన్ను చూసి నిర్మలంగా నవ్వేడు. తృప్తి అంటే ఏమిటో నా కర్థమైంది. ★★★★

→•←

ఇతరుల తప్పుల్నుంచి నేర్చుకోక తప్పదు. అన్ని తప్పులూ మనమే చేయటానికి సమయం సరిపోదు కాబట్టి. ★★★★★

→•←

మనిషి యొక్క కష్టంమీద, తెలివితేటల మీదే అతడు ఎంత సులభంగా బ్రతకాలి అన్నది నిర్దేశింపబడాలి. అంటే, మనిషి తన తెలివి తేటలతో ఎంత కష్టపడితే అంత సుఖాన్ని కోరుకునే హక్కు అతడికి వుంటుంది. ★★

→•←

ఈ ప్రపంచంలో కొంతమంది మిమ్మల్ని ద్వేషిస్తున్నారంటే దానికి కారణం మీ గుణాలు నచ్చక పోవటం కాదు. మీ అంత ఆనందంగా బ్రతకలేపోతున్నాము అని వాళ్ళు అనుకోవటమే. ★★★

→•←

విద్యుత్తు లేని మనుష్యులు ఎప్పుడూ నెంబర్ టూ స్థానంలోనే వుండి పై వారి సూచన్ల కోసం ఎదురు చూస్తూ వుంటారు. ★★

→•←

ఇద్దరూ చుక్కానీలు పట్టుకుంటే పడవ ఎటూ కదలదు. ఇద్దరూ తెడ్లు పట్టుకుంటే గమ్యానికి దూరంగా ఎటో వెళ్ళిపోతుంది. వివాహనౌక సవ్యంగా సాగాలంటే ఒకరు తెడ్డు, ఒకరు చుక్కానీ పట్టుకోవాలి. అవసరమైనప్పుడు పొజిషన్లు మార్చుకోవాలి. ★★★

→•←

ఓటమి అంటే, రెండోసారి ప్రయత్నం చెయ్యమన్న సూచన.

→•←

ఆనందంలోకి ప్రవేశించాలంటే రెండు ద్వారాలు దాటాలి. అనుభవం మొదటిద్వారం. ఓటమి రెండో ద్వారం. ★★★★★

→•←

"ఒక పని – నువ్వు చెయ్యాలనుకున్నా, చెయ్యలేననుకున్నా ... రెండూ కరెక్టే"

★★★★

→•←

నువ్వంటే నీ బ్యాంక్ అకౌంట్ కాదు. నీ చిన్ని ఇల్లు, నువ్వు చేసేపనీ, నీ ఆలోచన్లు. శక్తి సామర్థ్యాలు ఏమీ కాదు. నువ్వొక మిశ్రమానివి. ఆ మిశ్రమపు నిష్పత్తి నిరంతరం మారుతూ వుంటుంది. ఈ ప్రపంచంలో కోట్ల కోట్ల మంది ఉండొచ్చు గాక. కానీ నీలా మరొకరు లేరు. నీలో నిష్పత్తి మిశ్రమాన్ని మార్చుకోవలసిన బాధ్యత నీదే. అదే నిరంతర ఎదుగుదల. ★★★

→•←

అన్ని రకాలుగా ప్రయత్నించి విఫలమైతే..... ఇంకొక్కసారి ప్రయత్నించు. ★★★★★

→•←

మొగవాడి తెలివితేటలు – బహుమతి సెలెక్ట్ చేయటంలో బయట పడతాయి. స్త్రీ తెలివితేటలు – దాన్ని తీసుకునే విధానంలో బయట పడతాయి. ★★

→•←

నిరాశావాది మేఘాన్ని చూసి తుఫాను వస్తుందేమో అనుకుంటాడు. ఆశావాది వర్షం వస్తుందని సంబరపడతాడు. సంపూర్ణుడు ఆ మేఘాల మీద నడుస్తాడు.

★★★

→•←

అనుభవం ద్వారా తెలిసిన సగం సత్యం, ఇతరుల ప్రవచనాల ద్వారా తెలిసిన సంపూర్ణ సత్యం కంటే గొప్పది. ★★★

→•←

పెద్దవాళ్ళు పిల్లలకి ఇవ్వగలిగే గొప్పవరం. "తార్కికంగా ఆలోచించటం నేర్పటం." ★★

→•←

నిద్రపోతున్న సింహం కన్నా మొరిగే కుక్కవల్ల లాభం ఎక్కువ. ★★

→•←

చాలా వస్తువుల 'ధర' తెలుసుకోవచ్చు. 'విలువ' తెలుసుకోవటం కష్టం. ★★

→•←

అశాంతి కన్నా నిర్లిప్తత ఎక్కువ ప్రమాదకరం. ★★

→•←

చర్మం బయట వుండే సౌందర్యం – వయసుపై బడే కొద్దీ, లోపలికి వెళ్ళాలి. ★★★

→•←

ఒక తప్పుడు నిర్ణయం కన్నా – నిరంతరం సందిగ్ధం ఎక్కువ ప్రమాదకరం. ★★★

→•←

ఆలోచనల స్టాక్ కన్నా – మాటల అమ్మకం ఎక్కువైనప్పుడు జీవిత వ్యాపారంలో నష్టం తప్పదు. ★★★★★

→•←

దేవతలు గాలిలో ఎగరటానికి కారణం తెలుసా? గొప్పతనాన్ని వాళ్ళు తేలిగ్గా తీసుకుంటారు కాబట్టి. ★★

→•←

హృదయ మందిరంలోకి వచ్చిన ప్రతి ఆలోచనా ఒక ఆడపిల్లలాటిది. దేన్నీ నిరాకరించవద్దు. అందులోనే ఒక రాకుమార్తె వుండి వుండవచ్చు. మిమ్మల్ని రారాజుని చెయ్యవచ్చు. ★★

→•←

ఈ ప్రపంచంలో 3 మంచి పనులు– మూడు 'అ' లు, ఆలోచన – అవగాహన – ఆచరణ. ★★

→•←

నిస్పృహ అంటే – నువ్వేం కోరుకుంటున్నావో – దాన్ని పొందటాన్ని నువ్వేం కోల్పోతావో.... రెండిటి మధ్య తేడా. ఆ తేడా ఎక్కువ అయ్యే కొద్దీ విచారం ఎక్కువ అవుతుంది. 'నిస్పృహ' కి ఇంతకన్నా గొప్ప నిర్వచనం చెప్పటం కష్టం. ★★★★★

→•←

'నమ్మకం' అనేది ఎప్పుడూ 'తర్కా'నికి పొడిగింపుగా వుండాలి. నిర్హేతుకమైన నమ్మకం మూర్ఖత్వం. ★★

→•←

పోస్టల్ స్టాంప్ నుంచి మనిషి నేర్చుకోవలసింది చాలావుంది. గమ్యం చేరేవరకూ అది కర్తవ్యాన్ని అంటిపెట్టుకునే వుంటుంది. ★★★

→•←

పని చెయ్యని క్షణాలన్నీ సోమరితనానికి నిదర్శనాలు కావు. పనిలో కూడా గోచరమూ, అగోచరమూ అని వుంటాయి. అగోచరమైన పని 'ఆలోచన' కావొచ్చు. ★★

→•←

అచ్చు తప్పులు దిద్దుకోవటానికి... జీవితానికి రెండో ముద్రణంటూ వుండదు.

★★★★★

→•←

పరిష్కారించలేనంత పెద్ద సమస్య వచ్చినప్పుడు అందులో హాస్యాన్ని వెతకటం మంచిది. ★★

→•←

చెట్టుని చూసి నేర్చుకోవాలి. కొమ్మ నరకటానికి వచ్చిన వాడికి కూడా అది నీడ ఇస్తుంది. ★★

→•←

ఒక కోర్కెకీ, ఒక చర్యకీ మధ్య కాస్త టైంముంటుంది. చెయ్యాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోవటానికి ఆ టైమ్ సరిపోతుంది. ఆ నిర్ణయం మీదే మన సంతోషం, ఎదుగుదలా ఆధారపడి వుంటాయి. ★★★

→•←

ఒక చిన్న నిర్ణయం – మొత్తం జీవన విధానాన్నే మార్చవచ్చు. ★★

→•←

నాకు చాలా క్లిష్టమైన సమస్య వచ్చిందని ఎప్పుడూ అనుకోకూడదు. క్లిష్టమైనది కాకపోతే అది సమస్య ఎలా అవుతుంది? ★★★★★

→•←

ప్రారంభించటానికి ధైర్యం వుండాలి. కొనసాగించటానికి కృషి వుండాలి. పూర్తి చేయటానికి పట్టుదల వుండాలి. ఈ మూడు స్టేజీల్లోనూ మొహం మీద చిరునవ్వు వుండాలి. ★★★★★

→•←

ప్రతి గొప్ప పని వెనుకా ఒక గొప్ప నమ్మకం వుంటుంది. ★★

→•←

నిద్రపోయే ముందు రేప్రొద్దున్న గురించి ఆలోచించాలి. ఈ రోజు కలిగిన అనుభవంతో. ★★

→•←

తనకు సృష్టించటం చేతనైనవాడు... ఇతరుల సృష్టిని విమర్శించటంలో టైమ్ వేస్ట్ చేసుకోడు. ★★★

→•←

ప్రపంచమంతా నిద్రపోతున్నప్పుడు నీతో పాటూ మేల్కొని వుండి కబుర్లు చెప్పే స్నేహితుడు – పుస్తకం. ★★★★

→•←

ప్రపంచాన్ని చదవటానికి నేను టైమ్ వేస్ట్ చేసుకోను. నేను చదివే పుస్తకాలు ఆ పని చేస్తాయి. ★★

→•←

మనిషి గమ్యం సంపూర్ణత్వం కాదు. అభివృద్ధి. ★★

→•←

ఈ ప్రపంచంలో కెల్లా దురదృష్టవంతుడు అదృష్టాన్ని నమ్ముకున్నవాడు. ★★★

→•←

మంచి రచయిత అంటే – కొత్త విషయాన్ని తెలిసేటట్టు గానూ, తెలిసిన విషయాన్ని కొత్తగానూ చెప్పగలిగేవాడు. ★★★

→•←

అ'న'వసరమైన అభివృద్ధిని కేన్సర్ అంటారు. ★★

→•←

గెలుపు గృహానికి పెరటి ద్వారముండదు. సింహద్వారమే. ★★★★★

→•←

'నాకు ది బెస్టే' కావాలి. అంతకన్నా 'తక్కువ వప్పుకోను' అనుకునే వాడికి బెస్టే దొరుకుతుంది. ★★★

→•←

పిల్లలకు 'ఏం' చెయ్యాలో చెప్తే చాలు.... 'ఎలా' చెయ్యాలో చెప్పకపోతేనే వారి సృజనాత్మకత బయట పడుతుంది. ★★★

→•←

కేవలం 'బాధ్యత'లో తప్ప – మరే విషయంలోనూ తాను అగ్రస్థానంలో వుండాలని మంచి నాయకులెవరూ అనుకోరు. ★★

→•←

ఇంకా సరిగ్గా రూపు దిద్దుకోని చిత్రాన్ని ముందుగా చూడగలిగేవాడు 'నేత' అవుతాడు. ★★

→•←

మంచి పని చేయటానికి – మంచి ముహూర్తం అంటూ ఏదీ వుండదు. ★★★

→•←

అవతలి వాడు చేయలేననుకున్న పనిని అతనితో చేయించగలిగే వాడే నాయకుడు.

★★★

→•←

'ఎందుకు?' అని అడిగేవాడి కన్నా 'ఎందుక్కాదు?' అని అడిగేవాడు గొప్ప.

★★★

→•←

ఎక్కే వరకూ ఎవరెస్ట్ దుర్గమమే. ★★

→•←

వివాహం అంటే విందు భోజనమే కాదు. తరువాతి భోజనం కోసం అంట్లు కడగటం కూడా. ★★

→I•I←

అలసిపోకుండా నడిచేవారికి గమ్యమూ, ఓర్పుతో పని చేసేవాడికి విజయమూ ఎంతో దూరంలో వుండవు. ★★

→I•I←

విజయం అనేది ఒక సుదీర్ఘ యాత్ర – చిన్న పిక్నిక్ కాదు. ★★★★★

→I•I←

ఒప్పుకుంటేనే 'ఓటమి' మనల్ని చేరుతుంది. ★★

→I•I←

విజయానికి అయిదు మెట్లు

అది 'తిరుపతి' గానీ, 'ఊటీ' గానీ అక్కడ గడవటమే కాదు.... ప్రయాణం కూడా అంత ఆనందంగా వుండే ఏర్పాటు చేసుకోవాలి. ★★★

→•←

ఓ భగవంతుడా! ఆశలని మెదడులో నింపకు, ఆశలని హృదయంలో ఉంచి, అవి నెరవేరే ఆలోచనలని మెదడులో నింపు. ★★★★

→•←

ఆవేశం పెరిగి వాదనలు హెచ్చినప్పుడు డిటాచ్డ్‌గా వుండాలి. వాదనల వల్ల అభిప్రాయాలు మారవు. విషయం పక్కదారి పట్టవచ్చు. ★★★

→•←

- శత్రువుకి క్షమ
- ప్రత్యర్థితో సహనం
- అభ్యాగతుడికి అతిధ్యం
- స్నేహితుడికి హృదయం
- సాటి మనిషికి ప్రేమ
- నీకు నువ్వు గౌరవం

ఇచ్చుకోవటం మానవ ధర్మం. ★★

→•←

స్వేచ్ఛంటే మన ఆనందం ఇతరులకి విషాదాన్ని కలుగ జేయకపోవడం, మన ఆనందాన్ని మనం అనుభవించగలగటం. మన ఆనందం భవిష్యత్తులో ఏ విధమైన హానీ చేయదని మనం గాఢంగా నమ్మగలగడం. ★★★

→•←

మూర్ఖుడు ఆరు రకాల గుణాలు కలిగివుంటాడు.

1) కారణం లేకుండా కోపం తెచ్చుకోవటం.

2) అవసరం లేకుండా మాట్లాడటం.

3) ఎదుగుదల లేని మార్పును అభిలషించటం.

4) అవసరం లేని విషయాలలో తల దూర్చటం.

5) తెలియని వ్యక్తి మీద నమ్మకం వుంచటం.

6) శత్రువుని స్నేహితుడిగా భ్రమించటం. ★★

→•←

ప్రపంచంలో కెల్లా తెలివైన మగవాడు కూడా స్త్రీని అంచనా వేయటంలో మూర్ఖంగానే వుంటాడు. కానీ ప్రపంచంలో అతి మూర్ఖురాలైన స్త్రీ కూడా పురుషుడిని కరెక్టుగా అంచనా వేయగలుగుతుంది. ★★

→•←

తత్వ విదులైన గురువులు, సేవచేసిన నీకు ఉపదేశం చేస్తారు.

ఉపదేశమంటే, జ్ఞానం ఇవ్వటం కాదు. ఏది అజ్ఞానమో చెప్పటం!

అంతే!! ఏది సత్యమో, ఏది జ్ఞానమో తెలుసుకోవలసిన బాధ్యత మాత్రం నీదే!!!

★★★

→•←

ఈ ప్రపంచంలో మనిషికి కావలసిన ఏడు ముఖ్యవసరాలు గాలి, నీరు, తిండి, డబ్బు, డబ్బు, డబ్బు, డబ్బు. ★★

→•←

"అతడొక వృతం గీసుకుని నన్ను బయటకు తోసేశాడు. నేనొక పెద్ద వృత్తం గీసి అతడిని అందులోకి ఆహ్వానించాను." ★★★★★

→•←

ఒక చర్య జరగగానే, ఏ విధమైన ప్రతి చర్య ద్వారా తాను స్పందించాలో మనిషి ముందే తన మెదడుని కండీషన్ చేసుకుంటాడు. ★★

→•←

మనసు అబ్సొల్యూట్ విలువుందన్న విషయం మనం గ్రహించగలగాలి. ఈ అబ్సొల్యూట్ విలువకన్నా మనం ఎక్కువ ఊహించుకుంటే అది అహంకారం అవుతుంది. దానికన్నా తక్కువ ఊహించుకుంటే అది సెల్ఫ్ సిటీ (ఆత్మన్యూనత) అవుతుంది. ★★★★

→•←

మనిషిలో ఇద్దరు మనుషులుండాలి. నేనిక్కడ చెప్పేది ద్వంద్వ ప్రవృత్తి గురించి కాదు. ఒక మనిషి బయటి వ్యవహారాలన్నీ చూసుకుంటూ వుంటే మరొక మనిషి అంతర్గతమైన వ్యవహారాలని చూసుకుంటూ వుండాలి. ఈ అంతర్గతమైన మనిషికి ఎటువంటి తాకిడీ రాకుండా బయటి మనిషి కాపాడుతూ వుండాలి. అప్పుడే ఆ లోపలి మనిషి, ప్రపంచంలోనూ ప్రకృతి లోనూ వున్న ఆనందాలని, అందాలని ఆస్వాదించగలగుతాడు. ★★★★

→•←

ఒక సంపూర్ణమైన మనిషి ఎలా వుండాలని మనం అనుకుంటున్నామో, మనవారిని అలా వుండేలా చేయటానికి శతవిధాలా ప్రయత్నిస్తాం. ఒక సంపూర్ణమైన మనిషి ఎలా వుండాలని మనం అనుకుంటున్నామో, మనం అలా వుండటానికి ప్రయత్నించం. ★★★

→•←

ఆనందం 'కోసం' బ్రతక్కు, ఆనందం 'తో' బ్రతుకు. ★★★★★

→•←

వాస్తవం వేరు. దాన్ని మనం చూసే విధానం వేరు. ఆక్సిడెంట్‌లో గాయం తగిలితే కొందరు ప్రేక్షకులు విచారిస్తారు. ఎవరికీ ఏమీ కాకపోతే కొందరు నిరాశ చెందుతారు. ★★

→•←

సుఖవంతమైన మానవ సంబంధాలు కూడా డబ్బు ప్రాతిపదికగానే కొనసాగుతాయనటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆస్తి పంపకాలు, ముసలి తల్లిని ఎవరు ఉంచుకోవాలి. మొదలైనవన్నీ, ఆరోగ్యకరమైన మానవ సంబంధాల్ని దెబ్బతీసే విషయాలే కదా! ★★

→•←

ఈ ప్రపంచంలో కనీసం ఐదుగురు మిమ్మల్ని ప్రేమిస్తారు. అందులో ఇద్దరు ముగ్గురు మీ కోసం మరణించటానికి కూడా సిద్ధంగా వుండి వుండొచ్చు. ★★

→•←

మనకి ఎత్తయిన భవంతులున్నాయి. విడిపోతున్న కుటుంబాలున్నాయి. ఎక్కువ ఆలోచిస్తాం. తక్కువ నవ్వుతాం. మనకు బ్రతకటం తెలుసు. జీవించటం తెలీదు. హద్దులు దాటి చంద్రమండలానికి వెళ్తాం. రోడ్డు దాటి ఎదురింటి వాడిని మాత్రం పలుకరించం. ★★

→•←

మంచులో తడిసిన పూలని జీవితకాలంలో ఒకసారయినా చూడని వాడు ఈ ప్రపంచంలో కెల్లా పెద్ద దురదృష్టవంతుడు. ★★★★★

→•←

తన ఓటమికి కారణం బయట వ్యక్తులో, పరిస్థితులో కారణం అనుకున్నంతవరకూ ఎవరూ గెలవలేరు. ★★

→•←

విషాదం అంటే – ఇతరుల అనుభవాల్తో మనల్ని పోల్చుకోవటం. ఆనందం అంటే రాబోయే రేపటి మన అనుభవం గురించి ఆలోచిస్తూ ఈ రోజు ఆహ్లాదంగా పని చేయటం. ★★

→•←

ఒకప్పుడు మానసిక శాస్త్రవేత్తలు మనిషిని మూడు రకాలుగా విశ్లేషించేవారు. ఎ) నీ గురించి నువ్వేమనుకుంటున్నావో అది నువ్వు బి) నీ గురించి ఇతరులేమనుకుంటున్నారో అది నువ్వు సి) నిజంగా నువ్వేమిటో – అది నువ్వు!!! ఆధునిక విశ్లేషకులు ఈ థియరీలు ఒప్పుకోరు. వారు చెప్పేది ఒకే వాక్యం. "...నీకున్న దానితో నువ్వేం చేస్తావో, అది నువ్వు." ★★★★

→•←

ఇద్దరు అమాయకులు, ఇద్దరు తెలివైన వాళ్ళ మధ్య కూడా సంసారం సజావుగా నడవకపోవచ్చు. కానీ విభేదించినప్పుడు కనీసం ఇద్దరూ 'కొట్టుకోరు' ★★

→•←

చాలా సందర్భాల్లో – బయట వాళ్ళ చేత మంచి అనిపించుకోవటం కోసం, తల్లితండ్రులు తమ పిల్లల్ని అకారణంగా శిక్షస్తూ వారి ప్రవర్తనని సరిదిద్దుతూ వున్నామనుకుంటారు. ★★

→•←

'ఇంతకన్నా కల్లో గంజో తాగటం మంచిది' అనుకుంటారు చాలామంది. ఓ పది రోజులు అలా చేసాక, మొదటి జీవితం ఎంత బావుందో తెలుస్తుంది. ★★★★★

→•←

ఒక చిన్న మాటవల్ల మనసు మీద గాయం ఏర్పడితే, అది చర్మం మీద గీతకన్నా ఎక్కువ కాలం వుంటుంది. ★★

→•←

స్త్రీ వాద మంటే వివాహ వార్షిక తేదీ మర్చిపోవటం కాదు. ★★★

→•←

తల్లిదండ్రులు పిల్లలకి అవసరమైనంత ప్రేమని ఇవ్వటమే కాదు. కొంతకాలం తర్వాత, తమ గారాబపు ప్రేమ వారికి అవసరం లేదని కూడా గుర్తించగలిగి వుండాలి. ★★

→•←

మొగవాడు వందమాటల ద్వారా చెప్పింది, స్త్రీ ఒక చూపు ద్వారా చెపుతుంది. స్త్రీ వంద వాదనల ద్వారా నిరూపించదల్చుకున్న సత్యాన్ని పురుషుడు ఒక్క నిరసన ద్వారా తోసి పారేస్తాడు. ★★

→•←

అబద్ధానికి కాళ్ళు లేవు. అది నిలబడలేదు. కానీ రూమర్‌కి రెక్కలున్నాయి. అది ఎగరగలదు. ★★★

→•←

భాగస్వామిలోని విశిష్ట గుణాల్ని గుర్తించటం ఒక ఎత్తు. అప్పుడప్పుడు వాటిని ప్రస్తావించడం, పొగడటం ఒక ఎత్తు. ★★★★

→•←

అమాయత్వం కన్నా వచ్చే గొప్ప ఆనందం ఏదీ లేదు. అదెప్పటికీ నష్టం కలిగించకపోతే. ★★★

→•←

సంతోషం అంటే అన్ని ప్రశ్నలకీ సమాధానాలు తెలుసుకో గలగటం కాదు. సమాధానాలు అవసరం లేని ప్రశ్నల్ని మార్చిపోగలగటం. ★★★★

→•←

మనుష్యులంతా స్వార్థపరులే. అయితేనేం? స్వార్థం అనేది అంత అసహ్యించుకోవలసినంత చెడ్డదేమీ కాదు (అవతలి వారికి నష్టం కలిగించనంత వరకూ). కానీ దానికి 'ప్రేమ' అని పేరు పెడితేనే కష్టం. ★★

→•←

మనుష్యులు మూడు రకాలు, నడిచేవాళ్ళు, నడవని వాళ్ళు నడిపించే వాళ్ళు.

★★★★★

→•←

ఒక మనిషి తెలివితేటల స్థాయిని బట్టి – అతడు డీల్ చేసే వ్యక్తుల తెలివితేటల స్థాయి వుంటుంది. అందుకే బాబాలు, రాజకీయ నాయకులు, మాఫీయా లీడర్లు – తమకు తగిన భక్తుల్ని ఎన్నుకుంటారు. ★★★★

→•←

తప్పు చేయటం సహజం. అది తప్పుకాదని వాదించటం మూర్ఖం. అది నిజంగానే తప్పుకాదని నమ్మటం నీచం. ★★★

→•←

పఠనాసక్తి వున్న పేదవాడు, చదువురాని రాజు కన్నా అదృష్టవంతుడు. ★★★

→•←

క్షణం ఆత్మ శోధన, ఒక జీవిత కాలపు అనుభవం కంటే గొప్పది. ★★★

→•←

ఆధునిక యుగంలో రచయిత లెవరూ కొత్త విషయాల్ని చెప్పలేరు. పాత విషయాన్నే 'ఇంతకు ముందెవ్వరూ ఈ విషయాన్ని చెప్పలేదే' అనిపించేలా వ్రాయటమే వారిని ఒరిజినల్ రైటర్స్‌ని చేస్తుంది. ★★

→•←

ఒక వ్యక్తికి ఎంతమంది శత్రువులుంటే అంత గొప్పవాడి కింద లెక్క, ఎంతమంది ఇష్టపడని వాళ్ళుంటే అంత ఒంటరి కింద లెక్క, ఎంతమంది అసహ్యించుకునే వాళ్ళుంటే అంత నీచుడి క్రింద లెఖ్ఖ. ★★★★★

→•←

ఒక రకమైన పరిస్థితిలో, ఒక రకమైన మనస్తత్వం వున్న మనిషి ఎప్పుడూ అలాగే ప్రవర్తిస్తాడని నమ్మకమేమీ లేదు. అందుకే సైంటిస్టులు కృత్రిమమైన మనిషిని సృష్టించ లేకపోతున్నారు. ★★

→•←

కోపమొస్తే ముందు పది లెక్క పెట్టడం మంచిదంటారు. కానీ విమర్శించే ముందు ఆ విమర్శని పదిసార్లు ఉచ్చరించటం అంతకన్నా మంచిది. ★★

→•←

'ఐయామ్ సారీ' అని మనస్ఫూర్తిగా అనగలగటం మెచ్యూరిటీకి నిదర్శనం. ★★

→•←

ఈ ప్రపంచానికి జరుగుతున్న హానిలో సగం – వార్తల్లో ప్రముఖంగా కనపడదామనుకునే వారి వల్ల వస్తుంది. ★★★★★

→•←

ఈ ప్రపంచంలో చాలామంది అత్యవసరమైన కోర్కె అందరూ తనని సరీగ్గా అర్థం చేసుకోవాలని!! చిత్రమేమిటంటే – ఈ కోరికకే అర్థం సరిగ్గా లేదు. ★★★

→•←

మనం నోరు విప్పటం ద్వారా అవతలి వారికి సందేశమిస్తున్నామనుకోవటం భ్రమ. వారికి నచ్చే విధానంలో మన సందేశం లేకపోతే, ఇంకో 'నోరువిప్పే' వారి దగ్గిరకు వెళ్తారు వాళ్ళు. ★★★

→•←

తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించేవాడు గొప్పవాడు. తన సిద్ధాంతం కన్నా గొప్పది కూడా ఇంకొకటి వుండొచ్చు అని ఆలోచించేవాడు ఇంకా గొప్పవాడు.

★★★★★

→•←

రచయిత చెప్పేది అందరికన్నా ఎక్కువగా విమర్శకుడిని కలవరపరుస్తుంది. విమర్శకుడు చెప్పేది రచయితని తప్ప అందర్నీ కలవరపెడుతుంది. ★★★

→•←

ఈ ప్రపంచంలో కెల్లా అదృష్టవంతుడైన కుర్రవాడు – కేవలం తల్లిదండ్రుల సంపూర్ణ ప్రేమను పొందినవాడు కాదు. పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ ఆనందాన్ని పొందగలిగే వాడు. మొదటిది ఆధారపడటానికి, రెండోది వ్యక్తిత్వానికి దారి తీస్తుంది. ★★

→•←

ఆవేశంతో దహించుకుపోతున్న మనిషిని ఎవరూ పట్టుకుని కూర్చోరు. ఆ బూడిదని గాలి తీసుకుపోతుందంతే. ★★

→•←

రచయిత కలం నెమలి ఫించంతో తయారు కాబడినట్లుండాలి. ఎందుకంటే అతను అన్ని కళ్ళతో చూడగలగాలి. ★★★★★

→•←

మంచి పుస్తకాలు కాలంతోపాటు పరిణితి చెందుతాయి. నవ్వొస్తోందా? ఇప్పుడు చదివిన "మంచి" పుస్తకం అయిదేళ్ళ తరువాత చదివితే మరింత గొప్పగా వుంటుంది కదా! ★★★

→•←

దానిని సృష్టించింది తనేనని ఎవరూ చెప్పుకోవటానికి ఇష్టపడని ఒకే ఒకటి 'రూమరు.' ★★

→•←

నీ సమక్షంలో భయపడేవాడు – పరోక్షంలో నిన్ను అసహ్యించుకుంటున్నాడన్నమాట. ★★★★

→•←

మంచి తోటనీ, లైబ్రరీని పెంచే వాడికి దుఃఖం, ఆమడ దూరంలో వుంటుంది.

★★

→•←

మనిషితో పాటే చివరి వరకూ వుండేది పేరు మాత్రమే. అందుకే మంచిపేరు సంపాదించాలి. ★★★

→•←

పెళ్ళి ప్రాతిపదిక కాకుండా, ఒక మొగాడు స్త్రీని ఆకర్షించాలంటే చాలా అర్హతలుండాలి. కానీ స్త్రీ. మొగాడిని ఆకర్షించటానికి స్త్రీతత్వం చాలు. ★★

→•←

స్త్రీ తన సమస్యని మర్చిపోవటానికి, ఇతరుల సమస్యల్ని పరిష్కారించ పూనుకుంటుంది. ★★★

→•←

భార్య తల్లిలా వుంటుందని (వుండాలని) భ్రమించటంతోనే మొగవాడి పొరపాటు ప్రారంభం అవుతుంది. ★★

→•←

సాహిత్యంలో మంచిరచనలు, చెడ్డ రచనలు అని రెండు రకాలు లేవు. ఎక్కువ మంది ఎక్కువకాలం, తక్కువ మంది ఎక్కువకాలం, ఎక్కువమంది తక్కువ కాలం, తక్కువ మంది ఎక్కువ కాలం గుర్తుపెట్టుకునే నాలుగు రకాలున్నాయి.

★★★★

→•←

మనవి ఎంతో గొప్పవి అనుకున్న మన అలవాట్లు అవతలివారికి శుద్ధ దండగలా కనపడవచ్చు. ★★

→•←

అవతలి వ్యక్తిలో మంచి గుణాన్ని మెచ్చుకోవటం వేరు. అనవసర పొగడ్త వేరు. మొదటిది సంస్కారం. రెండోది చౌకబారుతనం. ★★

→•←

మనం మన గురించి ఎంత ఎక్కువగా మాట్లాడితే, అవతలి వారిని అంత ఎక్కువగా కన్‌ఫ్యూజ్ చేస్తున్నామన్నమాట. ★★★

→•←

ఒకప్పుడు ఆడపిల్లలు మంచి గృహిణి అవ్వాలని అనుకునేవారు. యిప్పుడు మంచి స్త్రీ అవ్వాలని అనుకుంటున్నారు. ★★★

→•←





మనోవైజ్ఞానిక సాహిత్యంలో అపూర్వ సంచలనం
సృష్టిస్తూ, దాదాపు రెండు కోట్ల రూపాయల
అమ్మకాల రికార్డుని అధిగమిస్తున్న సంచలన
వ్యక్తిత్వ పుస్తకాలు

- తప్పుచేద్దాం రండి!
- విజయానికి ఆరోమెట్టు
- మైండ్ పవర్ నెంబర్ 1 అవటం ఎలా?
- విజయంలో భాగస్వామ్యం
- విజయానికి అయిదు మెట్లు

గెలుపు కోసం ప్రతి వ్యక్తి ఆచరించవలసిన
సూత్రాల్ని పై పుస్తకాల్నుంచి క్లుప్తీకరించి -
పాఠకుల సౌలభ్యం కోసం

యండమూరి వీరేంద్రనాథ్

అందిస్తున్న విజయరహస్యాల సంకలనం

మంచుపూల వర్షం



నవసాహితి బుక్ హౌస్
ఏలూరు రోడ్ • విజయవాడ-520002
© 0866-2432885